నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నిజామాబాద్-కామారెడ్డి
మంగళవారం సెప్టెంబర్ 17, 2024 www.navatelangana.com

నవోదయలో ప్రవేశాలకు 23 వరకు గడువు పెంపు

నవతెలంగాణ-నిజాంసాగర్

మండల కేంద్రంలోని నవోదయ పాఠశాలలో 2025-2026 విద్యా సంవత్సరానికి ఆరవ తరగతి ప్రవేశాలకు నేటితో గడువు ముగియడంతో దానిని సెప్టెంబర్ 23 వరకు పెంచుతున్నట్లు విద్యాలయ ప్రిన్సిపల్ సత్యవతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష 18 జనవరి 2025న నిర్వహించనున్నట్టు ఆమె పేర్కొన్నారు. Https://navodaya.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె అన్నారు. నోటిఫికేషన్ ప్రకారం జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల పిల్లలకి 75 శాతం సీట్లను భర్తీ చేయనున్నట్టు తెలిపారు. ఇట్టి అవకాశాన్ని ఉమ్మడి నిజామాబాద్ జిల్లా గ్రామీణ ప్రాంత విద్యార్థులందరూ ఉపయోగించుకోవాలని ఆమె తెలిపారు.

నిమజ్జనంలో అపశృతి



చెరువులో నీటమునిగి ఒకరు మృతి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

గణేశ్ నిమజ్జనం వేళ అపశృతి చోటుచేసుకుంది. చెరువులో గణేశ్ ప్రతిమను నిమజ్జనం చేస్తూ ప్రమాదవశాత్తు నీట మునిగి యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని 11వ వార్డు శివారులోని గల పటేల్ చెరువులో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. ఎస్ఐ మహేష్ తెలిపిన వివరాల ప్రకారం.. 11వ వార్డు ఎస్సీ కాలానికి చెందిన బుజ్జిగారి రాకేష్ (23) వినాయక నిమజ్జనం కార్యక్రమానికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో మునిగి గల్లంతయ్యాడు.

వివరాలు మెయిన్‌లో..



వేడుకల ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడుతున్న కలెక్టర్, సీపీ, మున్సిపల్ కమిషనర్ తదితరులు

నేడు ప్రజాపాలన దినోత్సవ వేడుక

- ఇరు జిల్లాల్లో ముస్తాబైన కలెక్టరేట్‌లు
- ఏర్పాట్లు పరిశీలించిన అధికారులు, పోలీసులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/కామారెడ్డి

ప్రభుత్వం అట్టహాసంగా నిర్వహించ తలపెట్టిన ప్రజాపాలన దినోత్సవ వేడుకకు ఇరు జిల్లాల్లో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్) ముస్తాబైయ్యాయి. మంగళవారం నిర్వహించనున్న ఈ వేడుకల కోసం అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. నిజామాబాద్‌లో రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్ ఈరవత్రి ముఖ్య అతిథిగా విచ్చేసి, ఉదయం 10.00 గంటలకు త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించ నున్నారు. ప్రజా ప్రతినిధులు, పుర ప్రముఖులు విచ్చేయనున్న నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ తదితరులు ప్రజాపాలన దినోత్సవ తుది ఏర్పాట్లను సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వేదిక, ఆహూతులకు సిటింగ్ ఏర్పాట్లు, తదితర వాటి గురించి సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ సూచనలు చేశారు. ఈ మేరకు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. కలెక్టర్ వెంట అదనపు డీసీపీ కిషన్, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్, పర్యవేక్షకుడు పవన్ తదితరులు ఉన్నారు.

కాగా కామారెడ్డిలో రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి, మంగళవారం ఉదయం 10.00 గంటలకు త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరరించిన అనంతరం జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ప్రజా ప్రతినిధులు, పుర ప్రముఖులు, అధికారులు, ప్రజలు విచ్చేయనున్న నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. వేదిక, ఆహూతులకు సిటింగ్ ఏర్పాట్లు, తదితర వాటి గురించి సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో పనులను పర్యవేక్షిస్తున్నారు.

పోతే నాలుగు.. వస్తే నాలుగు

- సమయ వేళలు పాటించని ఆర్టీసీ బస్సులు
- వస్తే నిమిషాల వ్యవధిలో నాలుగైదు బస్సులు.. లేకుంటే గంటల పాటు ప్రయాణికుల పడిగాపులు
- తగ్గిన బస్సులు.. పెరిగిన ప్రయాణికులు
- బస్సుల కోసం ప్రయాణికుల నిరీక్షణ



లింగంపేట్ బస్టాండ్‌లో ఆగిఉన్న కామారెడ్డికి వెళ్లే మూడు బస్సులు



అంతకుముందు బస్సు కోసం గంటల తరబడి నిలబడిన ప్రయాణికులు

నవతెలంగాణ-లింగంపేట్

బస్టాండ్‌లో ఎదురుచూసే ప్రయాణికులకు బస్సులు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది. గంటల తరబడి ఎదురుచూడాల్సి వస్తుంది. ఈ క్రమంలో వస్తే ఒకే సారి నాలుగు బస్సులు వస్తుండగా.. తర్వాత బస్సులు గంటల తరబడి కానరావట్లేదు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. అసలే ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా బస్సులు లేక ఇక్కట్లు ఎదురవుతున్న వేళ.. సమయం పాలన లేకుండా ఇష్టానుసారంగా బస్సులు తిప్పుతుండటంతో ఉపయోగం లేకుండా పోతున్నాయి. దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయివేటు వాహనాలను ఆశ్రయించాల్సిన దుస్థితినెలకొంది.

కామారెడ్డి జిల్లాలో కామారెడ్డి, బాన్సువాడలో ఆర్టీసీ డిపోలో ఉన్నాయి. డిపోల పరిధిలో 220 బస్సులు ఉన్నాయి. ఇందులో సూపర్ లగ్జరీ 8, డీలక్స్ 19, ఎక్స్‌ప్రెస్ 40, పల్లె వెలుగు 150 బస్సులున్నాయి. జిల్లా వ్యాప్తంగా 105 రూట్లల్లో బస్సులు నడుపుతున్నారు. రోజుకు ప్రయాణికులు సుమారు 80 వేల మంది రాకపోకలు సాగిస్తుంటారు. కామారెడ్డి డిపోలో అత్యధికంగా ప్రాణికులు తిరిగే రామాయంపేట, కరీంనగర్, బాన్సువాడ నిజామాబాద్ నిజాంసాగర్ పిట్లం ఎప్పుడు చూసినా బస్సులు రద్దీగా ఉంటాయి. ప్రయాణికులు కామారెడ్డి డిపో పరిధిలో అధికంగా లాభం వచ్చే రూటు నిజాంసాగర్ పిట్లం రూట్లో ఆర్టీసీకి అదనంగా లాభం వస్తుంది. ఈ నేపథ్యంలో ఈ రోడ్లలో కేవలం 10 బస్సులను అధికారులు నడుపుతున్నారు. ఎప్పుడు చూసినా జనంతో బస్సులు కిటకిటలాడుతుంటాయి.

కామారెడ్డి డిపో పరిధిలో నిజాంసాగర్ పిట్లం ఎల్లారెడ్డి లింగంపేట్ మీదుగా వెళ్లే ఆర్టీసీ బస్సుల్లో ఎప్పుడు చూసినా ప్రయాణికులతో బస్సులన్నీ కితకిటలాడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు సమయ వేళలో పాటించకపో వడం తో ఇష్టానుసారంగా బస్సులు నడపడంతో బస్టాండ్ ప్రాంతంలో ప్రయాణికులతో బస్టాండ్ ప్రాంతం రద్దీగా దర్శనమిస్తుంది.

లింగంపేట్ నుండి కామారెడ్డి వెళ్లడానికి మధ్యాహ్నం 12 గంటల నుండి ఒంటిగంట వరకు ఒక్క బస్సు కూడా రాకపోవడంతో ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో ప్రయాణికులు బస్సుల గంటపాటు నిరీక్షించారు. ఒంటి గంట తర్వాత బస్సు రావడంతో దాని వెనకాలనే 10 నిమిషాల వ్యవధిలోనే మరో బస్సు మరో 10 నిమిషాలు వ్యవధిలోనే మరో బస్సు ఇంకో 10 నిమిషాలు వ్యవధిలో మరో బస్సు వచ్చాయి. ఇలా 30 నిమిషాల వ్యవధిలోనే నాలుగు బస్సులు రావడంతో ఆర్టీసీ అధికారుల తీరిపై ప్రయాణికుల మండిపడుతున్నారు. అరగంటకు ఒక బస్సు నడపాల్సింది పోయి గంట వరకు బస్సు లేకపోవడంతో పట్టణ ప్రాంతాలకు హైదరాబాద్, నిజామాబాద్ , కరీంనగర్ దూర ప్రాంతాలకు వెళ్లేవారు చేసేదేం లేక ప్రైవేటు వాహనాల్లో వెళ్లాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కామారెడ్డి నుండి నిజాంసాగర్, పిట్లం, లింగంపేట ఎల్లారెడ్డి మీదుగా బస్సు కోసం వచ్చే బస్సులు సైతం సమయ వేళలు పాటించడం లేదు. సుమారు గంట వరకు కామారెడ్డి బస్టాండ్లో సాయంత్రం 5 గంటల నుండి ఆరు గంటల 30 నిమిషాల వరకు రోజువారీగా బస్ కోసం వేచి చూడాల్సి వస్తుందని ప్రైవేటు వాహనాలు లేకపోవడంతో ఆర్టీసీ బస్సు కోసం నిరీక్షిస్తున్నామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ అధికారులను బస్సు ఏర్పాటు చేయమని మొరపెట్టుకుంటున్నా ఆర్టీసీ అధికారులు సరైన సమాధానం చెప్పకుండా చేతులెత్తుతున్నారన్నారు.

చర్యలు తీసుకుంటాం

ఇందిరా. కామారెడ్డి డిపో మేనేజర్

సమయ వేళలు పాటించని ఆర్టీసీ డ్రైవర్ల పై చర్యలు తీసుకుంటాము. గంటల తరబడి ప్రయాణికులు వేచి చూడకుండా అదనంగా బస్సు ఏర్పాటు చేసి ప్రయాణికులను తరలిస్తున్నా మన్నారు. ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటాము.

నగరంలో మిలాద్ ఉన్ నబీ ర్యాలీ



నెహ్రూ పార్క్ వద్ద

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రేమ, సహనం, శాంతి, సామరస్యాలను బోధించిన మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా నిజామాబాద్ నగరంలో ముస్లింలు ఆయా ప్రాంతాల్లో సోమవారం పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. నగరంలోని అన్ని ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జిల్లా కేంద్రంలోని ఖిల్లా రోడ్డు అహ్మద్ పూర కాలనీ బర్కత్ పుర, మాలపల్లి, కంఠేశ్వర్, ఎల్లమ్మ గుట్ట, వినాయక నగర్, తదితర ప్రాంతాల్లోని ఈద్గాలో ముస్లింలు ప్రార్ధనలు చేశారు. ఊరేగింపులో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రతిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా ఎంఐఎం నాయకులు షకీల్ అహ్మద్, మునావర్ ఆధ్వర్యంలో హైమదీ బజార్ లోని ఆ పార్టీ కార్యాలయం వద్ద షర్బత్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇద్రీస్ ఖాన్, సహాబాజ్ హైమద్, కార్పొరేటర్లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సాయుధ పోరాటం ముమ్మాటికి కమ్యూనిస్టులదే

- బిజెపి హిందూ ముస్లింల మధ్య గొడవలకు ఆజ్యం పోయడం మానుకోవాలి
- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్, ఎస్వీ రమ



సభకు హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు



సీతారాం ఏచూరికి నివాళి అర్పిస్తున్న నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ముమ్మాటికి కమ్యూనిస్టుల పోరాటమే. బీజేపీ మాత్రం హిందూ ముస్లింల మధ్య గొడవలకు ఆజ్యం పోయడం మానుకోవాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్, ఎస్వి రమ అన్నారు. సోమవారం కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ మార్కిస్ట్ నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక నాందేవ్‌వాడలోని జిల్లా కార్యాలయంలో సీపీఐ(ఎం) అఖిలభారత జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. ఏచూరికి నివాళి అర్పించిన అనంతరం తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవ సభ పెద్ది వెంకట రాములు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి వారు హాజరై మాట్లాడారు.

తెలంగాణ సాయుధ పోరాటాన్ని పునికి పుచ్చుకొని పార్టీ జాతీయ కార్యదర్శిగా సీతారాం ఏచూరి ఎదిగిన తీరును అందరూ ఆదర్శంగా తీసుకొని ఐక్య ఉద్యమాలు నిర్వహించ డమే ఆయనకు ఇచ్చిన నివాళి అని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం నైజాం నవాబుకు, పెత్తందారులకు, దొరలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటమే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమని తెలిపారు. కానీ బిజెపి లాంటి పాలక పార్టీలు ముస్లిం రాజుకు హిందువులకు మధ్య జరిగిన పోరాటంగా చిత్రీకరించడం బాధాకరం అని అన్నారు. చరిత్ర కలిగిన తెలంగాణ సాయుధ పోరాటాన్ని బీజేపీ వక్రీకరించడం అంటే కన్నతల్లి గుండెను విచ్చినపరచడమే అవుతుంది అని అవేదన వ్యక్తం చేశారు. ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం వల్లభాయ్ పటేల్ ఆధ్వర్యంలో సైనిక చర్యను జరిపి హింసకాండకు తెరలేపి 4 వేల కమ్యూనిస్టు కార్యకర్తలను చంపినట్టు తెలిపారు. నైజాం సర్కార్, ఖాసిం రజ్వీ లను ఓడించి 3 వేల గ్రామాలను, లక్షల ఎకరాలను పంచిపెట్టిన చరిత్ర కమ్యూనిస్టుల తోనే సాధ్యం అయింది అని అన్నారు. చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, షోయబుల్లాఖాన్, మొగ్దుం మొయినుద్దీన్, సుందరయ్య, రావి నారాయణరెడ్డి , ఏచూరి ఆశయాల బాటలో పయనించి భవిష్యత్తు పోరాటాలకు నాంది పలకాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యవర్గ సభ్యురాలు నూర్జహాన్, శంకర్ గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు నాన్నేసాహెబ్, సుజాత, నాగేశ్వర్ రావ్,విఘ్నేష్, ఈవీల్ నారాయణ, కటారి రాములు తదితర నాయకులు పాల్గొన్నారు.

నేడు మద్యం దుకాణాల బంద్

నవతెలంగాణ-కంఠేశ్వర్

గణేశ్ నిమజ్జన వేడుకల నేపథ్యంలో నేడు(మంగళవారం) కమిషనరేట్ పరిధిలో మద్యం అమ్మకాలపై ఆంక్షలు విధించారు. ఈ నెల 17న మంగళవారం మద్యం షాపులు మూసి ఉంచాలని సీపీ కల్మేశ్వర్ ఆదేశాలు జారీ చేశారు. అలాగే కల్లు డిపోలు, బార్లు సైతం మూసి ఉంచాలని స్పష్టం చేశారు.

కాలినడకతో మొదలు ఎడ్లబండి నుంచి రథం వరకు..

- నిజామాబాద్‌లో నిమజ్జన శోభయాత్ర ప్రస్థానం
- నాడు స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితో కదిలిన పలువురు యువకులు
- నేటి నిమజ్జనోత్సవ శోభయాత్రకు ఏర్పాట్లు పూర్తి



ఫైల్



నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్‌లో గణేశ్ నిమజ్జనోత్సవానికి వన్నె తెచ్చే వేడుక రథం శోభయాత్ర. రథంపై గణేశ్ విగ్రహాలను పెట్టి ఎడ్లతో లాగుతూ దుబ్బ నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి వినాయక బావిలో నిమజ్జనం చేస్తుంటారు. ఈ వేడుకను తిలకించేందుకు జిల్లా కేంద్రవాసులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి సైతం వస్తుంటారు. ఊరేగింపు దారిపొడుగునా సందర్శకులతో ఆయా రోడ్లు కిటకిటలాడు తుంటాయి. సార్వజనిక్ గణేశ్ మండలి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ వేడుకకు 80 ఏండ్ల చరిత్ర ఉంది. స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో పది మంది యువకులతో ప్రారంభమైన ఈ వేడుక.. అప్రతిహతంగా కొనసాగుతూనే ఉంది. తొలుత గణపతి విగ్రహాలను నెత్తిమీద పెట్టు కుంటూ వెళ్లగా.. తదనంతరం ఎడ్లబండ్ల మీద, ప్రస్తుతం ప్రత్యేక రథం చేయించి శోభయాత్ర నిర్వహిస్తున్నారు.

సార్వజనిక గణేష్ మండలి ఆధ్వర్యంలో నిజామాబాద్ నగరంలోని దుబ్బాలో గల శ్రీ సిద్ధి బుద్ధి సహిత మహా గణపతి మందిరం నుంచి ప్రారంభమయ్యే రథ యాత్ర కు చారిత్రాత్మక ప్రాధాన్యత కలిగి ఉంది. పెద్ద ఎత్తున కొనసాగిన స్వాతంత్ర పోరాట స్ఫూర్తితోనే ఈ రథ యాత్ర సరిగ్గా 80 ఏళ్ళ క్రితం పది యువకులు కలిసి మొదలు పెట్టారు. స్వాతంత్ర్యం కాంక్షను పెద్దఎత్తున ప్రచారం చేసేందుకు ముంబయిలో బాలగంగాధర్ తిలక్ గణేశ్ ఉత్సవాలను వేదికగా చేసుకున్న విషయం విధితమే. అదే స్ఫూర్తితో నిజామాబాద్‌లో పది మంది యువకులు నాటి బ్రిటిల్ పాలకుల ఆంక్షలను సైతం ధిక్కరించి సార్వజనిక గణేష్ మండలిని 1944లో వ్యవస్థాపక ట్రస్టును ఏర్పాటు చేశారు. అందులో కాశీనాథ్ రావు ముప్కాల్, పి నరసింహారావు, గంజుల పోశెట్టి, కిషన్ దాస్, మురళీధర్ అటల్, మురళీధర్ శర్మ, మారుతి రావు పవర్, ముక్క చంద్రశేఖర్ గుప్తా, పాట్కురి యెగొండ స్వామి, బాపూరావు కుబేర్కర్, బంటు రంచొడ్ లాల్ ఈ ట్రస్టును కేవలం గణేష్ ఉత్సవాల నిర్వహణ కోసమే ఏర్పాటు చేశారు.

మొదట రథం ఉండేది కాదు. గణపతి ప్రతిమలను నగరంలో అయిదారు చోట్ల మాత్రమే పెట్టేవారు. తొమ్మదవ రోజు ఆ విగ్రహాలను ఆయా మండలిల యువకులు చేతుల మీదే మోసుకొని ఈ కమిటీ ఆధ్వర్యంలో ఊరేగింపుగా వెళ్లి నగర శివారులో వ్యవసాయ భూమిలో ఓ మోట బావి లో విగ్రహాలను నిమజ్జనం చేసేవారు. ఆ తర్వాత దుబ్బ ప్రాంతలో కొందరు రైతులు ఎడ్ల బండిలను అలంకరించి అందులోనే గణనాధులను తీసుకెళ్లేవారు. ఆ తరువాత ఎడ్లుబండ్లు సరిపోకపోవడంతో అప్పుడే వచ్చిన ట్రాక్టర్లు ట్రాలీ మీద తీసుకెళ్లారు. ఆ తర్వాత ప్రముఖ ఫర్టిలైజర్స్ కంపెనీ ఆర్థిక సహకారంతో 1975వ సంవత్సరంలో కట్టేతోనే భారీ రథం తయారు చేయించారు. ఆ కట్టే రథానికి ఎడ్లను కట్టి లాగే వారు. 2016లో సార్వజనిక్ మండలి నిర్వాహకులు విశాలమైన రథాన్ని తయారు చేయించారు. ప్రస్తుతం అదే రథం ఉంది. దాని ద్వారానే ఇప్పటివరకు గణేష్ నిమజ్జనాలను కొనసాగిస్తున్నారు. గణేశ్ నిమజ్జన శోభయాత్ర ఊరేగింపు నగరంలోని దుబ్బ ప్రాంతం నుంచి మొదలుకొని రైల్వే గేటు మీద నుంచి గాంధీ చౌక్ నుంచి నెహ్రూ పార్క్ నుంచి పవన్ టాకీస్, గురుద్వార్, గాజుల్‌పేట్, గోల్ హనుమాన్, పాటీ గల్లి, పూలంగ్, చివరగా వినాయక్‌నగర్‌లోని వినాయకుల బావిలో నిమజ్జనం చేస్తుంటారు.

ఈ ఊరేగింపులో నిజామాబాద్ కలెక్టర్ తో సహా రెవిన్యూ అధికారులు, పోలీసు భద్రత యంత్రాంగం చాలా పటిష్టంగా ఏర్పాట్లు చేస్తుందని నిర్వాహకులు చెబుతున్నారు. గతంలో ఊరేగింపు ఎడ్లపై జరిగినప్పుడు 45 జతల ఎడ్లు ఉండేవని ప్రస్తుత అధ్యక్షుడు బంటు గణేష్ తెలిపారు. కానీ వ్యవసాయంలో ఎడ్ల బండ్ల కనుమరుగు అయిపోవడంతో దశాబ్ద కాలంగా రథం లాగడానికి ఎడ్లను సమకూర్చడం కష్ట తరం అయింది. కానీ ఆనవాయితీగా కొనసాగించాలనే పట్టుదలతో పొరుగు ఉన్న మహారాష్ట్ర నుంచి 10 నుంచి 15 ఎడ్ల జతల ఎడ్లను అద్దెకు తెప్పిస్తున్నారు.

మత సామరస్యంగా రథయాత్ర

సార్వజనిక్ గణేశ్ మండలి అధ్యక్షులు బంటు గణేశ్

సార్వజనిక్ గణేష్ మండలి ఆధ్వర్యంలో నిర్వహించే గణేష్ నిమజ్జన ఊరేగింపులో జిల్లాలోని ప్రజలు అందరూ సహకారాలు అందిస్తున్నారు. మత సామరస్యంగా ఈ వేడుక జరుగుతూ వస్తుంది. ముస్లింలు కూడా పాల్గొని సేవ కార్యక్రమాలు చేపడుతుం టారు. దుబ్బ నుంచి ప్రారంభమైన గణేష్ నిమజ్జన రథయాత్ర వినాయకుల భావి వరకు చేరుకొని అక్కడ వినాయకులను నిమజ్జనం చేసి ఎంతో సంతోషంగా ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది.

విలేకరులు కావలెను

నవతెలంగాణ

తెలుగులో తప్పులు లేకుండా రాయగలిగి, సామాజిక స్పృహతో స్పందించే ఉత్సాహం.. అవినీతి, అక్రమాలను వెలికితీసే ధైర్యం, ప్రశ్నించేతత్వం, ప్రజాసమస్యలను వెలికితీసి పాత్రికేయ వృత్తిలో రాణించాలనే ఆసక్తి మీలో ఉందా..? ఆ అవకాశాన్ని 'నవతెలంగాణ' కల్పిస్తోంది. ఖాళీ మండలాల్లో భర్తీకి ఆహ్వానిస్తోంది

ఖాళీ మండలాలు

నిజామాబాద్ జిల్లా

నిజామాబాద్‌టౌన్, బోధన్ టౌన్, భీంగల్, రుద్రూర్, ఆలూర్, డొంకేశ్వర్

కామారెడ్డి జిల్లా

కామారెడ్డి టౌన్, బాన్సువాడ, బీర్కూర్, రాజంపేట్, మాచారెడ్డి, పాల్వంచ, తాడ్వాయి, జుక్కల్

నవతెలంగాణ బుక్‌హౌజ్‌లో పనిచేసేందుకు ఇన్‌చార్జి కావలెను

అడ్రస్ : నవతెలంగాణ దినపత్రిక కార్యాలయం సుభాష్‌నగర్. ఎస్‌బిఐ పక్కన, నిజామాబాద్.

సంప్రదించాల్సిన నెంబర్లు :
94945 73764, 94900 99408

వైద్యం కోసం ఆర్థిక సహాయం అందజేత


ఆర్థిక సహాయం అందజేస్తున్న పలువురు

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రానికి చెందిన జంగడి దీక్షిత (5) అనే చిన్నారికి గుండెలో రంధ్రం పడి చికిత్స పొందుతోంది. ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ద్వారా తెలుసుకున్న బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ ఆమె వైద్య ఖర్చుల సహాయార్థం ఐదువేల రూపాయల ఆర్థిక సహాయాన్ని పంపించారు. ఆర్థిక సహాయాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం వారి కుటుంబ సభ్యులకు అందజేశారు.

యోగా పోటీల్లో విశ్వవికాస్ విద్యార్థి గెలుపు


విద్యార్థిని అభినందిస్తున్న పలువురు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

2024-25 రాష్ట్రస్థాయి యోగా ఛాంపియంషిప్‌లో 4వ తరగతి విద్యార్థిని దీక్షిత 1వ స్థానంలో గెలుపొంది పాఠశాలకు గుర్తింపు తెచ్చి అద్భుతమైన విజయాన్ని సాధించినందుకు గర్వంగా ఉందని తెలంగాణ యోగ అసోసియేషన్ నిర్వహించిన ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమం 2024 సెప్టెంబర్ 14, 15 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగిందని తెలిపారు. ఆమె కోచ్, సపోర్ట్ చేసిన తల్లిదండ్రులకు పాఠశాల కరస్పాండెంట్ అప్పారావు, ప్రిన్సిపాల్ సుస్మిత హృదయపూర్వక అభినందనలు తెలిపారు. విశ్వ వికాస్ స్కూల్ దీక్షిత వంటి యువ ప్రతిభావంతులను పెంపొందించడానికి, యోగా వంటి కార్యకలాపాల ద్వారా శారీరక దృఢత్వం, మానసిక శ్రేయస్సును ప్రోత్సహించడానికి కట్టుబడి ఉటుందని అన్నారు.

గ్యాస్ సబ్సిడీ పత్రాలను అందించిన నాయకులు

నవతెలంగాణ-బోధన్

ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలలో భాగంగా గ్యాస్ సబ్సిడీ అమలు చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దాంతో సబ్సిడీపై గ్యాస్ సిలిండర్లు పొందిన లబ్దిదారులకు సబ్సిడీ డబ్బులు లబ్ధిదారుల ఖాతాలో జమ చేయడానికి చర్యలు చేపట్టింది. అయితే సబ్సిడీ అమలు అయిన పత్రాలను సోమవారం సాలూర గ్రామ పంచాయతీ వద్ద పంచాయతీ కార్యదర్శి లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మెన్ జనార్దన్, లైబ్రరీ చైర్మెన్ స్వామిగౌడ్, సరిడే సాయిలు, పాండు, సంజీవ్, సురేష్, నాగరాజు, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి చిప్పల పోగుకోసం 20న వేలం

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

మాధవనగర్‌లోని సాయిబాబా ఆలయంలో కొబ్బరి చిప్పలను రెండు సంవత్సరాల వరకు పోగు చేసుకునేందుకు 20న మంగళవారం వేలం వేయనున్నట్టు సాయిబాబా ఆలయ ఈవో రవీందర్ గుప్తా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తేదీన వేలం నిర్వహించాల్సి ఉండగా.. ఎవరూ ముందుకు రాకపోవడంతో ఈ నెల 20వ తేదీకి పొడిగించినట్టు పేర్కొన్నారు. కావున ఉత్సాహవంతమైన భక్తులు, వ్యాపారస్తులు ఐదువేల రూపాయలు సొమ్ము చెల్లించి ఈ బహిరంగ వేలంలో అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

ఇందిరా మహిళ శక్తి క్యాంటీన్ ప్రారంభం


మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య అయ్యప్ప శ్రీనివాస్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోనే మొట్టమొదటిసారిగా ఈ క్యాంటీన్‌ను ఆర్మూర్‌లో ప్రారంభించడం ఆనందంగా ఉందని అన్నారు. త్వరలో మరిన్ని క్యాంటీన్‌లు ఏర్పాటు చేస్తామని కమిషనర్ రాజు అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఆకుల రాము, జీవి నరసింహారెడ్డి, శాలా ప్రసాద్, ఫాయాజ్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, పర్యావరణ ఇంజనీర్ పూర్ణమౌళి, టీఎంసీ ఉదయశ్రీ, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

- రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

త్వరలో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా మొక్కజొన్న, సోయా కొనుగోలు కేంద్రాలను మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ప్రారంభించనున్నట్టు తెలంగాణ రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి సోమవారం తెలిపారు. రైతులు తొందరపడి మద్దతు ధర కంటే తక్కువకు అమ్ముకోకూడదని సూచించారు.

యంచ గోదావరి నిమజ్జన స్థలాన్ని పరిశీలించిన అడిషనల్ కలెక్టర్

నవతెలంగాణ-నవీపేట్

మండలంలోని యంచ గోదావరి నిమజ్జన స్థలాన్ని జిల్లా అడిషనల్ కలెక్టర్ కిరణ్ కుమార్ సంబంధిత అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాట్ల విషయమై రెవెన్యూ, ఆర్అండ్‌బీ, ట్రాన్స్‌కో అధికారులను అడిగి తెలుసుకున్నారు. వినాయక ప్రతిమల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా వన్వే ఏర్పాటుతో పాటు విద్యుత్ సౌకర్యం, క్రేన్‌లను ఏర్పాటు చేసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహించే సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఎటువంటి అపశృతులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో వెంకటరమణ, ఎంపిడివో నాగనాథ్, ఎంపీఓ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనం శాంతియుతంగా నిర్వహించాలి

నవతెలంగాణ-బాల్కొండ

గణేష్ నిమజ్జనాన్ని శాంతియుతంగా నిర్వహించాలని ఎస్ఐ బి.నరేష్ అన్నారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా బాల్కొండ పోలీస్‌స్టేషన్‌లో వివిధ కమిటీ సభ్యులతో సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. గణేష్ నిమజ్జనాన్ని శాంతియుతంగా జరుపుకోవాలని కమిటీ సభ్యులకు సూచించారు. అనంతరం డీజే యజమానులతో సమావేశమై వారికి పలు సూచనలు చేశారు. పోలీస్‌శాఖ సహకారం పూర్తిస్థాయిలో ఉంటుందని నిమజ్జనం సందర్భంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు వివరించారు.

బేస్‌బాల్ పోటీల్లో బాలికల జట్టు ప్రథమ స్థానం

- బాలుర జట్టు తృతీయస్థానం


ట్రోఫీని అందుకుంటున్న బాలికల జట్టు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఈనెల 14 నుండి 16 వరకు ఎన్టీఆర్ స్టేడియం నిర్మల్‌లో జరిగిన 5వ రాష్ట్ర జూనియర్ బెస్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో ఫైనల్ మ్యాచ్ నిజామాబాద్ బాలికల జట్టు నల్గొండ జట్టుపై 11-0 పరుగుల తేడాతో విజయం సాధించి రాష్ట్ర బాలికల ఛాంపియన్‌గా నిలిచింది. బాలుర జట్టు తృతీయస్థానం మ్యాచ్ నిజామాబాద్ జట్టు వరంగల్ జట్టుపై 2-1 పరుగుల తేడాతో విజయం సాధించి తృతీయ స్థానం కైవసం చేసుకున్నట్లు జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు లింగన్నగారి మధుసూదన్ రెడ్డి, సొప్పరి వినోద్ సోమవారం తెలిపారు. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, ప్రత్యేక ఆహ్వానితులు రాష్ట్ర బేస్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్వేత చేతుల మీదుల బహుమతి అందుకున్నారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి బొజ్జ మల్లేష్‌గౌడ్, సాఫ్ట్‌బాల్ జిల్లా అధ్యక్షులు వి.ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగామోహన్ అభినందించారు. జిల్లా జట్టు కోచ్ మేనేజర్లుగా మర్కంటి గంగామోహన్, ఈ.నరేష్, బి.మౌనిక, నల్లూరి లతా, గంగాధర్ సంతోష్ వ్యవహరించారు.

నేడు వినాయక నిమజ్జనం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలో మంగళవారం వినాయక నిమజ్జనం నిర్వహిస్తున్నట్టు సార్వజనిక్ గణేశ్ మండలి అధ్యక్షులు బంటు గణేశ్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 11వ రోజు నిమజ్జనం చేస్తున్నట్టు ఆయన వెల్లడించారు. నగరంలో వినాయక నిమజ్జనం రథ యాత్రను ప్రతీ ఏడాది ఉన్నట్లే ఉంటుందని తెలిపారు. రథయాత్ర దుబ్బచౌరస్తాలో సార్వజనిక్ గణేష్ మండలి అధ్యక్షులు బంటు గణేష్ జెండా ఊపి వినాయక రథయాత్రను ప్రారంభిస్తారు. రథయాత్ర ప్రారంభమై గుర్బాబాది రోడ్-శివాజీ చౌక్-లలితా మహల్, రైల్వేగేట్- గాంధీ గంజ్ వన్ టౌన్- గాంధీ చౌక్- నెహ్రూ పార్క్- బోధన్ బస్టాండ్- పవన్ టాకీస్ చౌరస్తా- బర్కత్ పుర- గురుద్వారా చౌరస్తా-పెద్ద బజార్ చౌరస్తా-ఆర్య సమాజ్, గోల్ హనుమాన్- పాటిగల్లి- పూలాంగ్ చౌరస్తా- వినాయక్ నగర్- వినాయక్ బావి వరకు కొనసాగి వినాయకులను నిమజ్జనం చేస్తారన్నారు. పెద్ద గణపతి ఉంటే అనగా 8 ఫీట్లు దాటితే బాసర, నందిపేట్ మండలం ఉమ్మెడ ప్రాంతాలకు తరలిస్తారని బంటు గణేష్ తెలిపారు. జానకంపేట్ నవీపేట్ వద్ద రైల్వే ఎలక్ట్రానిక్ లైన్‌ఉండడంతో ఎత్తయిన విగ్రహాలు బాసర వెళ్లడానికి అవకాశం లేదన్నారు. 8 ఫీట్ల కన్నా ఎత్తయిన విగ్రహాలను ఉమ్మెడ బ్రిడ్జి వద్ద నిమజ్జనం చేయడానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. నగరంలోని ఏర్పాటు చేసిన వినాయక నిర్వాహకులు ఈ విషయం గమనించాలని తెలిపారు.


కంఠేశ్వర్: సాంస్కృతిక నృత్యాలు చేస్తున్న మహిళలు


వివిధ వేషాధారణలో చిన్నారులు

ఆధ్యాత్మిక పోటీలు.. ఆటపాటలు

కంఠేశ్వర్ : నగరంలోని వినాయక ఉత్సవాల్లో పూజలతో పాటు ఆయా మండపాల నిర్వాహకులు స్వామివారి దర్శనానికి తరలివచ్చే భక్తులకు ఆటవిడుపు కార్యక్రమాలను చేపడుతున్నారు. చిన్నారుల నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నారు. తాంబోలా, కుర్చీలాట, భజనలు, భక్తిగీతాలు, నీతి శ్లోకాలు పఠనం, భగవద్గీత, పాటల పోటీలను చేపట్టి విజేతలకు బహుమతులు అందిస్తున్నారు. నగరంలోని వినాయక మండపాలలో అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. వినాయక నిమజ్జనానికి రెండు రోజులు మాత్రమే ఉండడంతో ఆదివారం చాలా వినాయక మండపాలలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఆకట్టుకుంటున్న మండలాలు..

కొందరు లక్కీడ్రాలో భాగంగా ద్విచక్ర వాహనాలు, ఫ్రిజ్, కుక్కర్ వంటి వస్తువులు, లడ్డులు, స్వామివారికి అలంకరించిన ఇత్తడి ప్రతిమలు, గోమతిచక్రాలు, గుమ్మడికాయలు వంటి వాటిని ఉంచుతున్నారు. గెలిచిన వారికి చివరి రోజున అందించేందుకు సమాయత్తం అయ్యారు. చిన్నారులు వేషధారణతో ఆకట్టుకుంటున్నారు.

చంద్రనగర్ గణేష్ మండలి..

నగరంలోని చందర్‌నగర్ గణేష్ మండలి ఆధ్వర్యంలో వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం యజ్ఞం నిర్వహించారు. సాయంత్రం చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించారు.

తెలంగాణ బాల్ బ్యాడ్మింటన్ సంఘం ఎన్నిక

- సంయుక్త కార్యదర్శిగా బోనగిరి శ్యామ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ


మాట్లాడుతున్న కమిటీ సభ్యులు

తెలంగాణ రాష్ట్ర బాల్ బాడ్మింటన్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం కూకట్పల్లి హైదరాబాద్‌లో నిర్వహించారు. రామకృష్ణరావు అధ్యక్షతన సమావేశమై తెలంగాణ రాష్ట్ర బాల్ బ్యాట్మెంటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రవీందర్‌గౌడ్ 2020-24 నివేదికను సమర్పించి కార్యవర్గాన్ని రద్దు చేస్తూ, నూతన కార్యవర్గాన్ని 2024-2028 సంవత్సరానికి గానూ ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు బాల్ బ్యాట్మెంటన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చీఫ్ అడ్వైజర్ ఎం. శ్రీనివాసరావు, తెలంగాణ క్రీడా ప్రాధికారిక సంస్థ పరిశీలకులుగా అలెగ్జాండర్ ప్రాన్సీ, తెలంగాణ బలంపిక్ సంఘం పరిశీలకులుగా సతీష్‌గౌడ్ హాజరయ్యారు. బాల్ బ్యాట్మెంటన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అబ్జర్వర్ పి.వెంకటరమణ, ఈ ఎన్నికలకు ఎన్నికలరిటర్నింగ్ అధికారిగా రోహిత్ అడ్వకేట్ వ్యవహరించారు. ఈ సర్వసభ్య సమావేశంలో వివిధ జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు. నూతన అధ్యక్షులుగా డాక్టర్ బంగారి స్వామి ఎండీ, ప్రధాన కార్యదర్శిగా వి.వెంకటరమణ, కోశాధికారిగా ఎం. చిన్నయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా దుర్గయ్య, రవీంద్రవర్మ, శ్రీకాంత్ రెడ్డి, మని మాధవి, సురేష్ కుమార్, సంయుక్త కార్యదర్శులుగా కమల్ కుమార్, రవీంద్రకుమార్, బి.శ్యామ్ నిజామాబాద్, స్వామిగౌడ్, తిరుపతి, కవిత ఎన్నుకున్నారు.

తెలంగాణ బాల్ బ్యాట్మెంటన్ సంఘం సంయుక్త కార్యదర్శిగా నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోనగిరి శ్యామ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన ఎన్నిక పట్ల జిల్లా బాల్ బ్యాట్మెంటన్ సంఘం అధ్యక్షులు మానస గణేష్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు విద్యాసాగర్‌రెడ్డి, బాల్ బ్యాడ్మింటన్ సంఘం ఉపాధ్యక్షులు నర్సయ్య, రంజిత్, కిషోర్, కిషన్, రాజ్‌కుమార్, కోశాధికారి రాజేశ్వర్, సంఘం సభ్యులు నాగేష్, కృష్ణమూర్తి, సురేష్, మాధురి, భాగ్య, వినోద్, శ్రీకాంత్, హాకీ సంఘం ప్రధాన కార్యదర్శి రమణ, హ్యాండ్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి సురేందర్, గట్టడి రాజేష్, వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్.గంగాధర్, జక్క రాజేశ్వర్,ఎం రాజేందర్,బి నాగేష్,నరేంద్ర చారి, కే నాగేష్, భూపతి, సంతోష్, ఠాగూర్,చిన్నయ్య, మధు,సదక్ నాగేష్,తదితరులు అభినందించారు.

విద్యుత్ ఉద్యోగులకు టీ షర్ట్స్ పంపిణీ

నవతెలంగాణ-ఆర్మూర్



టీ షర్ట్స్ అందుకున్న విద్యుత్ ఉద్యోగులు

పట్టణంలో మంగళవారం జరగబోయే గణేష్ నిమజ్జన కార్యక్రమానికి విద్యుత్ ఉద్యోగులు ధరించడానికి టిజిఎన్‌పిడిసిఎల్ గల వైట్ కలర్ టీషర్ట్స్‌ను విద్యుత్ అధికారులు ఏడిఈ శ్రీధర్, ఏఈ ఆశ్రితరెడ్డి ఇతర విద్యుత్ అధికారులు సోమవారం ఆవిష్కరించి టౌన్ విద్యుత్ సిబ్బందికి అందజేశారు. ఈ టీషర్ట్స్‌ను గణేష్ నిమజ్జనం రోజున విద్యుత్ సిబ్బంది ధరిస్తారని అధికారులు తెలిపారు. దీంతో ప్రజలకు విద్యుత్ సిబ్బందిని గుర్తుపట్టడం సులభమవుతుందని వివరించారు. గణేష్ నిమజ్జనం రోజున విద్యుత్ సంబంధిత సమస్యలు ఏమైనా ఉంటే ఆశ్రితరెడ్డి ఏఈ 9440811629, రవీందర్ లైన్ ఇన్‌స్పెక్టర్ 9493546612, సీతారాములు లైన్ ఇన్‌స్పెక్టర్ / న్యూ 9848327500, గోల్‌బంగ్లా నుంచి కాశి హనుమాన్ వీధి వరకు ఎల్లయ్య లైన్‌మెన్ 9550059915, హుస్నాబాద్, చిన్నబజార్, గుమ్ములవాడ, అరుంధతినగర్‌కు సంబంధించి అజర్ లైన్‌మెన్ 8333994759, రాంనగర్, జిరాయత్‌నగర్ శాస్త్రినగర్‌కు సంబంధించి ప్రభాకర్ లైన్‌మెన్ 9010931869, గాంధీ రోడ్, న్యూ బస్టాండ్ ఏరియా మహాలక్ష్మి కాలనీకి సంబంధించి సంతోష్ లైన్‌మెన్ 8886003779, రాజారాంనగర్, యోగేశ్వర కాలనీ సైదాబాద్ టీచర్స్ కాలనీకి సంబంధించి రమేష్ లైన్‌మెన్ 8074415490, హౌసింగ్ బోర్డ్ కాలనీ సంతోష్‌నగర్ వడ్డెర కాలనీ రంగాచారినగర్‌కు సంబంధించి రాంచందర్ లైన్‌మెన్ 8333994758, గుండ్ల చెరువు దగ్గర బాహూరావు లైన్ ఇన్‌స్పెక్టర్ 9493546615 నెంబర్లకు ఫోన్ చేయవచ్చని ఏడిఏ తెలిపారు.

కార్మిక కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

- మాజీ ఎమ్మెల్సీ వీ గంగాధర్‌గౌడ్

నవతెలంగాణ-ఎడపల్లి/నిజామాబాద్ రూరల్


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్

కార్మికులలో అందరికీ సొసైటీలు ఉన్నా లేకున్నా పేద కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం రూ.500 కోట్ల బడ్జెట్ కేటాయించి వారి కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్సీ వీ గంగాధర్‌గౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని కుర్నాపల్లి మాజీ సర్పంచ్ దుబ్బాక సావిత్రి భర్త దుబ్బాక రవీందర్ గౌడ్ గత నెలలో ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడిపోవడంతో రవీందర్ గౌడ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న నిజామాబాద్ ఎమ్మెల్సీ వి గంగాధర్‌గౌడ్ సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట గ్రామ సంఘం అధ్యక్షులు నటరాజ్ గౌడ్, మాణిక్యాల సురేష్ గౌడ్, శ్రీహరిగౌడ్, ఉత్తంగౌడ్, ఎల్లాగౌడ్ పాల్గొన్నారు.

నిజామాబాద్ రూరల్ : బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్య దర్శి, మాజీ ఎమ్మెల్సీ వి గంగాధర్ గౌడ్ కొత్తపేట మాజీ సర్పంచ్ బొడిగె రాములు చనిపోయిన విషయం తెలుసుకు ని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించా రు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మండలాధ్యక్షులు మీసాల మధుకర్‌రావు, మాజీ ఎంపీపీ ప్రేమ్ నాయక్, జడ్పి టిసి రామ్ గోపాల్ రెడ్డి, ఎస్టీ మండలాధ్యక్షుడు బానోత్ గోపాల్ నాయక్, ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి వసంతరావు, ఇతర గ్రామాల సర్పంచులు రాంగోపాల్‌రెడ్డి, సాయిలు, ప్రభాకర్, జెట్టి మొగులయ్య కొత్తపేట అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

వంటగ్యాస్ సబ్సిడీ పత్రాలు పంపిణీ

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలో మహాలక్ష్మి పథకానికి దరఖాస్తులు చేసుకున్న లబ్దిదారులకు వంటగ్యాస్ సబ్సిడీ మంజూరు పత్రాలను ప్రభుత్వం ద్వారా గ్రామ పంచాయతీలకు మంజూరు అయ్యాయి. ఇందులో భాగంగా మండలంలోని జంలం గ్రామంలో 162 మంది లబ్ధిదారులకు మహాలక్ష్మి పథకం కింద, అలాగే మంగల్‌పాడ్ గ్రామంలో దరఖాస్తు చేసుకున్న వారిలో 392 మందికి వంటగ్యాస్ సబ్సిడీ పత్రాలను వచ్చాయి. వాటిని సోమవారం బిల్ కలెక్టర్ రాజు లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చేపూర్ శ్రీనివాస్ గౌడ్, లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష ఐదువేలకు లడ్డు వేలం


లడ్డు దక్కించుకున్న సాయిరాహుల్‌రెడ్డి

నవతెలంగాణ-బోధన్


బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ గణేష్ కాలనీలోని వినాయక మండపం వద్ద సోమవారం లడ్డూ వేలం పాట నిర్వహించారు. శ్రీ షిరిడి సాయి గణేష్ మండలి వారు నిర్వహించిన ఈ వేలం పాటలో లక్ష 5వేల ఒక రుపాయికి హైదరాబాద్‌కు చెందిన గణ విద్యా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సాయిరాహుల్‌రెడ్డి లడ్డూను దక్కించుకున్నారు. గణేష్ మండలి నిర్వాహకులు లడ్డును పూజల అనంతరం అందజేశారు. అనంతరం గణేషుడి మెడలో అలంకరించిన నోట్ల హారం వేలం నిర్వహించగా 36,500కు స్థానిక బిజెపి నాయకుడు యేశాల సురేందర్ కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో గణేష్ మండలి నిర్వాహకులు ఎర్రం రవి, గాదె ప్రవీణ్, దుర్కి రవి, యేషాల శేఖర్, దురా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పిఆర్‌టియు జిల్లా అసోసియేషన్ అధ్యక్షులుగా గంట అశోక్

నవతెలంగాణ-ఆర్మూర్

జిల్లా కేంద్రంలో ఇటీవల జరిగిన ఎన్నికలలో జక్రాన్‌పల్లి మండలం చింతలూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న లిగంట అశోక్ భారీ మెజారిటీతో పిఆర్‌టియు టిఎస్ అసోసియేట్ అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ.. తనను బలపరచి ఓటువేసిన అన్ని మండలాల అధ్యక్ష కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు ఒక్కక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా ఏ ఉపాధ్యాయునికి ఉన్న ఎలాంటి సమస్యలైన జిల్లా అధికారులతో, మండల స్థాయి అధికారులతో అటు అధికారులను ఇటు జిల్లా సంఘం బాధ్యులను సమన్వయ పరుస్తూ ఉపాధ్యాయుల సమస్యలను నూటికి నూరుశాతం పరిష్కరిస్తానని అన్నారు.

పీఆర్టీయూ జిల్లా కార్యదర్శిగా సాధుల గంగాధర్



నవతెలంగాణ-ఏర్గట్ల

నిజామాబాద్‌లో నిర్వహించిన పీఆర్టీయూ జిల్లా కార్యవర్గ ఎన్నికల్లో ఏర్గట్ల ప్రాథమిక పాఠశాలకు చెందిన సాధుల గంగాధర్ జిల్లా కార్యదర్శిగా పోటీచేసి గెలుపొందినట్లు ఏర్గట్ల పీఆర్టీయూ మండలాధ్యక్షులు కృష్ణ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికైన గంగాధర్ మాట్లాడుతూ.. తాను అత్యధిక మెజార్టీతో గెలవడానికి సహకరించిన మండల, జిల్లా, రాష్ట్ర నాయకులకు ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు దశేంధర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు భాస్కర్, రాష్ట్ర కార్యదర్శి సుధాకర్, మండల కార్యవర్గ సభ్యులు సురేష్, సుధాకర్, మమత తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి
మంగళవారం | సెప్టెంబర్ 17, 2024 | www.navatelangana.com

చెరువు కట్టకు మరమ్మతు



మరమ్మతులు పనులు చేపడుతున్న సిబ్బంది

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని భవానిపేట్ గ్రామ సమీపంలో గల సాద్వాల్ చెరువు మరమ్మతు పనులు సోమవారం చేపట్టారు. సద్వాల చెరువు ఇటీవల కురిసిన వర్షానికి కట్ట పూర్తిగా కుంగి పోయింది. దీనితో బుంగపడే అవకాశాలు ఉన్నాయి. ఆయకట్టు రైతులు ఇరిగేషన్ అధికారులకు మండల అధికారులకు సమాచారం అందించారు. దీంతో సోమవారం కట్ట కృంగిపోయిన ప్రాంతాన్ని పరిశీలించి ట్రాక్టర్లతో మట్టిని పోస్తున్నారు. కట్ట మరమ్మతు చేపట్టడంతో ఆయకట్టు రైతులు ఊపిరి పీల్చుకున్నారు. గతంలో బుంగపడి నీరు వృథా కావడంతో ఆయకట్టు రైతులు పంటలు సాగు చేయలేకపోయారు. ప్రస్తుతం చెరువు నీటితో నిండిపోవడంతో కట్టకు ప్రమాదం ఉందని గుర్తించి మట్టిని పోస్తున్నారు. అదేవిధంగా తూము వద్ద బుంగపడకుండా ఇరిగేషన్ అధికారులు జాగ్రత్తలు పాటిస్తున్నారు.

లడ్డు వేలం.. రూ.34,501

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండల కేంద్రంలోని రథంగల్లి శ్రీ శెత్కరి గణేష్ మండలి లడ్డు వేలంపాట ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ వేలం పాటలో ఆకుల వార్ గంగాధర్ అనే వ్యక్తి రూ.34,501 దక్కించుకున్నారు. ఇదే వేలంపాటలో సేపులు రెండింటికి ఎస్ఎస్ క్రాకర్స్ అనే వ్యక్తి 12,600కు దక్కించుకున్నారు. శాలువా రాజేష్ తూమువార్ అనే వ్యక్తి 6000 రూపాయలకు దక్కించు కున్నారు. ఈ విధంగా లడ్డు సేపులు శాలువా మూడింటిని కలిసి 53,101 వేలంపాట ద్వారా శ్రీ శెత్కరి గణేష్ మండలికి ఆదాయం వచ్చింది వేలం పాటలు పాల్గొని దక్కించుకున్న భక్తులకు గణేష్ మండలి నిర్వాహకులు వారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

సంతకం విలువ రూ 6.5 లక్షలు

- భూమి లేని వ్యక్తి సంతకంతో వీడీసీ భూమి ఇతరులకు పట్టా
- అక్రమార్కులను గుర్తించే పనిలో వీడీసీ

నవతెలంగాణ-భిక్కనూర్

భూమి కొనుగోలు చేయాలంటే భూమి ఉన్న వ్యక్తి నుండి కొనుగోలు చేయాలి. కొనుగోలు చేయడానికి ముందు పట్టా, ప్రభుత్వ భూమి, భూమి ఎవరిపైన ఉంది, ఎంతమంది చేతులు మారింది, ఎవరెవరు కొనుగోలు చేశారు, భూమిపై ఏవైనా లోన్లు ఉన్నాయా లేదా పూర్తి వివరాలు సేకరించిన తర్వాత కొనుగోలు చేస్తారు. భిక్కనూరు పట్టణంలో మాత్రం ఒక వ్యక్తిపై ఎలాంటి భూమి లేకుండా 2017 సంవత్సరంలో ఆ వ్యక్తి నుండి 6 లక్షల 50 వేల రూపాయలు చెల్లించి కొనుగోలు చేయడం, రిజిస్ట్రేషన్ చేసుకోకుండా ధరణి ఆన్‌లైన్లో నమోదు చేసుకోవడం విడ్డూరంగా మారింది.

వివరాలు ఇలా ఉన్నాయి 1995 సంవత్సరంలో వీడీసీ ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన 10 గుంటల భూమి అమ్మిన వ్యక్తి నుండి పేపర్లు రాసుకొని సంతకాలు తీసుకొని ఆ పేపర్లను గ్రామ పంచాయతీలు భద్రపరిచారు. వ్యవసాయ భూములు, సాదా బైనామా ద్వారా పేపర్ల పై రాసుకున్న భూములు ధరణి ఆన్ లైన్లో నమోదు చేయాలని అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో పూర్తి పాత రికార్డులు పట్టా పాస్ పుస్తకాలు, సాదా బైనమ పేపర్ల ద్వారా ధరణిలో రికార్డు చేశారు.

వీడీసీ ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన 10 గుంటల భూమి ధరణిలో రికార్డు చేసే సమయంలో కొందరు ప్రజా ప్రతినిధుల ద్వారా గ్రామపంచాయతీ నుండి బయటకు వచ్చింది. ఆ భూమి వివరాలు గ్రామపంచాయతీ నుండి మాయం చేసి భూమి లేని వ్యక్తికి భూమిని పేపర్లపై సృష్టించి రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు నమ్మించి ఆ వ్యక్తికి 6 లక్షల 50 వేల రూపాయలు చెల్లించి వీడీసీ 10 గుంటల భూమితో కలిపి 16 గుంటల భూమిని రిజిస్ట్రేషన్ చేసుకోకుండా ధరణిలో నమోదు చేసుకున్నారు. ఈ మధ్యకాలంలో వీడీసీ భూమిని చదును చేయడంతో అసలు విషయం బయటకు వచ్చింది. అమ్మిన వ్యక్తి ఎవరు, కొనుగోలు చేసిన వ్యక్తి ఎవరు, అసలు కొనుగోలు ఎలా జరిగింది, రిజిస్ట్రేషన్ చేసుకోకుండా ధరణిలో ఏవిధంగా ఆన్ లైన్ చేశారు అన్న వివరాలు వీడీసీ సభ్యులు ఆరా తీస్తున్నారు.

రెవెన్యూ రికార్డుల్లో ఏ మాత్రం భూమిలేని వ్యక్తి పైకి భూమి రికార్డులో నమోదు చేసి పేపర్లను సృష్టించి రిజిస్ట్రేషన్ చేసుకోకుండా ధరణిలో ఆన్ లైన్ నమోదు చేయడం కారణంగా అసలు ఏ సంబంధం లేని వ్యక్తి, కుటుంబ సభ్యులు ప్రస్తుతం ఆందోళన చెందుతున్నారు. కొందరు ప్రజా



వీడీసీ కొనుగోలు చేసిన స్థలం

ప్రతినిధుల మాటలు విని భూమి విషయంలో అనవసరంగా ఇరుక్కున్నానని, తనపై భూమి లేదని చెప్పిన ఏ విధంగా పేపర్లు సృష్టించారు తెలియక సంతకం పెట్టుమన్న చోట పెట్టానని ఆ వ్యక్తి తెలియజేస్తున్నట్లు సమాచారం.

ఏది ఏమైనప్పటికీ 1019 పూర్తి భూమి సర్వే చేసి ఎవరి హద్దులు వారికి ఏర్పాటు చేసి వీడీసీ పేపర్లు మాయం చేసింది ఎవరు..?, రిజిస్ట్రేషన్ లేకుండా ధరణిలో రెవెన్యూ అధికారులు ఏ విధంగా ఆన్లైన్ చేశారు పూర్తి వివరాలు సేకరించి మాయం చేసిన వ్యక్తులపై, రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తిపై కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి సమాచారం అందజేసి చర్యలు తీసుకుంటామని కాంగ్రెస్ పార్టీ నాయకులు, వీడీసీ సభ్యులు తెలియజేస్తున్నారు.

రైతు వేదిక కార్యాలయానికి దారేది..?



సూచిక బోర్డు లేని రైతువేదిక

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూరు పట్టణ కేంద్రంలో గ్రామ శివారులో రైతు వేదికను వెంచర్‌లో గ్రామ పంచాయతీకి కేటాయించిన స్థలంలో నిర్మించారు. రైతు వేదిక రోడ్డుపై వెళ్లే వారికి రైతు వేదిక కనపడకపో వడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పాత ఎన్ హెచ్ 7 రోడ్డు పై నిలబడి చూసిన రైతు వేదిక కనబడకుండా చెట్లు అడ్డం ఉండడం, రోడ్డు పక్కన ఎలాంటి బోర్డు లేని కారణంగా వ్యవసాయ పనుల కొరకు రైతు వేదికకు వెళ్లే వారికి ఎక్కడ ఉందో తెలియక తికమక పడుతున్నారు. వ్యవసాయ అధికారులు స్పందించి రోడ్డు పక్కన రైతు వేదిక కార్యాలయ బోర్డు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

ఇసుక అక్రమ రవాణాపై అధికారుల కొరడా

- రెండు లారీలు సీజ్



లారీలను సీజ్ చేసిన అధికారులు

నవతెలంగాణ-మద్నూర్

ఇసుక అక్రమ రవాణాపై అధికారులు కొరడా ఝుళిపించారు. డోంగ్లి మండల పరిధిలోని మంజీరా నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు లారీలను ఆదివారం రాత్రి అధికారులు పట్టుకొని సీజ్ చేశారు. అధికారులు, పోలీస్ శాఖ రెవెన్యూ శాఖ పకడ్బందీగా నిఘా పెడుతూ అక్రమ ఇసుక రవాణాపై ఇదే విధంగా చర్యలు తీసుకోవాలనే డిమాండ్‌లు వ్యక్తమవుతున్నాయి. అయితే ఎలుకలను పట్టుకొని ఏనుగులను వదులుతున్న చందంగా అధికార యంత్రాంగం పనితీరు ఉన్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అక్రమ ఇసుక రవాణా పట్ల ముచ్చటగా మూడు మండలాలకు అక్రమ ఇసుకదారులు అధికారుల కండ్లు కప్పి రాత్రింబవళ్లు నడిపిస్తున్నారని ఆరోపణలు ప్రజల్లో వ్యక్తం అవుతున్నాయి. మంజీరా నది ఇటు డోంగ్లి అటు పొతంగల్ కోటగిరి మండలాలకు పరిసరాల ప్రాంతాల్లో ఉంది. మూడు మండలాల అధికారులు మంజీరా నదిపై ఎలాంటి నిఘా పెట్టడం లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ఇసుక అక్రమంగా రవాణా జోరుగా నడుస్తున్నట్టు సమాచారం. ఇకనైనా మంజీరా నది నుండి అక్రమంగా ఇసుక తరలిపోకుండా ఇటు డోంగ్లి మండల రెవెన్యూ శాఖ అటు పోతంగల్ కోటగిరి సంబంధిత శాఖల అధికారులు నిఘా పెట్టవలసిన అవసరం ఎంతైనా ఉందని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పారిశుధ్య కార్మికులకు సామగ్రి పంపిణీ

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గణేష్ నిమజ్జనం సందర్భంగా టేక్రియాల్ పెద్ద చెరువు దగ్గర నిర్వహిస్తున్న నిమజ్జనం లో పాల్గొంటున్న మున్సిపల్ పారిశుద్ధ కార్మికులకు, రేడియం జాకెట్, నైలాన్ గ్లోసెస్, సిమ్మింగ్ ట్యూబ్స్, నైలాన్ రోప్, అప్రాన్స్, లైఫ్ జాకెట్, వస్తువులను మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో, మున్సిపల్ కమిషనర్ సుజాత, మున్సిపల్, పట్టణ కౌన్సిలర్లు, పంపరి లతా శ్రీనివాస్, ఆకుల రూపా రవి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నిమజ్జనం..

నవతెలంగాణ-గాంధారి/సదాశివనగర్

గత తొమ్మిది రోజులుగా పూజలు అందుకున్న గణనాథుడు గంగమ్మ ఒడికి చేరాడు. గాంధారి మండల కేంద్రంలో గణేష్ శోభాయాత్ర ప్రధాన వీధుల గుండా నిర్వహించారు. వివిధ గణేష్ మండపాల వారు ఏర్పాటు చేసిన గణనాథుల అలంకరణ ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. అలాగే యువకులు చిన్నారులు నృత్యాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఆదివారం ప్రారంభమైన నిమజ్జన శోభయాత్ర సోమవారం రాత్రి వరకు కొనసాగింది. చివరకు గణనాథుడు గంగమ్మ ఒడికి చేరుకున్నాడు. ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా జరగడంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది

శోభయాత్ర వేళ.. మహాఅన్నదానం

గాంధారి మండల కేంద్రంలో గణేష్ నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా 1993-94 సంవత్సరం 10వ తరగతి పూర్వ విద్యార్థులు మండల కేంద్రంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గణేష్ శోభాయాత్ర



ముస్తాబు చేసిన ట్రాక్టర్‌లపై గణనాథుల ఊరేగింపు

సందర్భంగా గణేష్ శోభాయాత్రను తిలకించడానికి వచ్చే భక్తుల కోసం మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 8 వరకు మహా అన్నదాన కార్యక్రమం కొనసాగింది. ఈ కార్యక్రమంలో 1993- 94 10వ తరగతి బ్యాచ్ విద్యార్థులు పాల్గొన్నారు.

సదాశివనగర్ మండలంలో..

సదాశివనగర్ : మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం గణేష్ నం నిర్వహించారు. భక్తి శ్రద్ధ లతో నిమజ్జనం నిర్వహించారు. మండలంలోని సదాశివనగర్ వజ్జపల్లి యాచారం తదితర గ్రామాల్లో నిర్వహించారు.

అధికారం కోల్పోయాక మతిభ్రమించినట్టుంది

- జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి

నవతెలంగాణ-రామారెడ్డి

అధికారం కోల్పోయి హరీష్ రావు మతిభ్రమించి మాట్లాడటం సరైనది కాదని జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి అన్నారు. సోమవారమిక్కడ మాట్లాడుతూ అధికారం కోల్పోగానే ప్రజలకు ఏదో ఒరగ పెడుతున్నట్టు నటించడం, మీ అధికార దాహానికి నిదర్శనమని ఆరోపించారు. రాంనగర్ లో అద్దె ఇంట్లో ఉండి, అద్దె కట్టక పోతే ఓనర్ ఇల్లు ఖాళీ చేయించింది నిజం కాదా, ఇల్లు కిరాయి కట్టని నీవు, 10 సంవత్సరాలు అధికారంలో ఉండి కోట్లకు కోట్లు ఎలా సంపాదించావాని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేసి, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన తెలంగాణను పది సంవత్సరాలు మీ కుటుంబం దోచుకున్నది చాలదా అని ప్రశ్నించారు. మామ ఫామ్ హౌస్‌లో, బామ్మర్ది అమెరికాలో ఉంటూ అడ్డగోలుగా మాట్లాడటం మానుకోవాలని, కేసీఆర్‌ను రైతులకు రుణమాఫీ చేయకుండా, దళిత బంధు ఇచ్చి ఇవ్వ నట్లు, రాష్ట్రవ్యాప్తంగా డబల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వకుండా చేసింది నువ్వే అని అన్నారు. ప్రజలు కష్టాల్లో ఉంటే వారి మధ్యలో ఉంటూ సాధకబాధకాలు తెలుసుకొని, ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య ప్రతిపక్ష హోదాలో సూచనలు చేస్తూ, ప్రజలకు న్యాయం జరిగేలా ప్రభుత్వానికి సహకరించ వలసిన మీరు, ఆపదలో ఉన్న ఖమ్మం, వరంగల్ ప్రజల వద్దకు వెళ్లకుండా, మహిళలను కించపరుస్తూ, రౌడీలాగా, గుండాలాగా సమాజంకు పట్టిన చీడపురుగు అయినా కౌశిక్ రెడ్డి వద్దకు వెళ్లినప్పుడే మీ నైజం, మీ జెండా, అజెండా ప్రజలకు అర్థమైపోయిందని,. కానీ మైకు దొరికింది కదా అని ఇష్టమొచ్చినట్టు మాట్లాడితే, ప్రజలఆగ్రహానికి ఆహూతైపోతారని అన్నారు.

ఆకర్షణీయ ప్రకటనలతో మోసపోవద్దు

- ప్రయివేటు విత్తన కంపెనీలపై చర్యలు తీసుకుంటాం
- రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్ అవినాష్ రెడ్డి
- నకిలీ విత్తనంతో నష్టపోయిన పంట పరిశీలన

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

రైతులు ప్రైవేట్ విత్తనాల పట్ల జాగ్రత్త వహించాలని రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్ అవినాష్ రెడ్డి అన్నారు. ఆకర్షణీయ ప్రకటనలు చూసి మోసపోవద్దని సూచించారు. మండల కేంద్రంలోని రైతుల వరి పొలాలను అవినాష్ రెడ్డి సోమవారం పరిశీలించారు. జక్రాన్‌పల్లి రైతుల ఫిర్యాదు మేరకు మండల కేంద్రంలోని మహేంద్ర సీడ్ కంపెనీ ఇచ్చిన వరి పొలాలను పరిశీలించారు. మండలంలో మొత్తము 500 ఎకరాలకు సరిపడా వరి విత్తనాలు మహేంద్ర సీడ్ కంపెనీ సరఫరా చేయడంతో విత్తనం ఫెయిల్ అయి పొట్ట దశలో పొట్ట బయటకు రాకుండా ఆగిపోయింది. అదేవిధంగా మరి గొలక బయట పడిన తర్వాత కంకినల్లి రోగం సుడిదోమ పురుగులు ఆశించడంతో పంట రాలేక రైతులు దిగాలుగా ఉన్నారని అన్వేష్ రెడ్డి వెంటనే అగ్రికల్చర్ కమిషనర్‌కు మాట్లాడి మంగళవారం సైంటిస్టులను మండల కేంద్రానికి పంపించి మహేంద్ర సీడ్ కంపెనీ ఇచ్చిన విత్తనంతో వేసిన వరి పొలాలను పరిశీలించి వివరాలు తెలియజేయాలని కోరారు. అనంతరం మహేంద్ర సీడ్ కంపెనీ మేనేజర్ తో



వరి పంటను పరిశీలిస్తున్న అన్వేశ్‌రెడ్డి, అధికారులు, రైతులు

ఫోన్లో మాట్లాడడంతో మేనేజర్ వాతావరణ పరిస్థితుల వల్ల ఆ విధంగా జరిగిందని తెలిపారని అవినాష్ రెడ్డి అన్నారు. అనంతరం అవినాష్ రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రైవేట్ విత్తన కంపెనీలకు హెచ్చరిస్తూ ఆకర్షణీయమైన ప్రకటనలు చేస్తూ రైతులను మోసం చేయవద్దని అన్నారు. రైతులకు తక్కువ కాలం అంటే 110 రోజుల వ్యవధిలో పండే వరి రకాలను ఇచ్చి మోసం చేయడంతో అధిక రోగాలు రావడంతో రైతులు దానిని గమనించలేక పంట నష్టపోతున్నారని , ఎన్ని పురుగు మందులు స్ప్రే చేసిన పంట చేతికి వచ్చి పరిస్థితి లేదని అన్నారు. నివేదిక రాగానే సీడ్ కంపెనీపై ఇతర ప్రైవేటు కంపెనీలపై తగు కఠిన చర్యలు తీసుకొని రైతులకు నష్ట పరిహారము అందిస్తామని అన్నారు. ఆయన వెంట ఏడియే ప్రదీప్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి దేవిక, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి, అర్గుల్ సింగిల్ విండో చైర్మన్ ఆర్మూర్ గంగారెడ్డి, బ్రాహ్మణపల్లి సింగిల్ విండో చైర్మన్ కాట్పల్లి నర్సారెడ్డి, జక్రాన్ పల్లి మండలం మాజీ వైస్ ఎంపీపీ జితేందర్ నాయక్, మాజీ సర్పంచ్ నర్సారెడ్డి, తాజా మాజీ ఎంపీటీసీ రుపాల గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శివాజీసేన ఆధ్వర్యంలో హెూమం

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని సిద్ధ రామేశ్వర నగర్ గ్రామంలో సోమవారం శివాజీ సేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద లోక కళ్యాణార్థం హెూమా కార్యక్రమాలు, కుంకుమ అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుండి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తుల కొరకు వినాయక విగ్రహం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శివాజీ సేన సభ్యులు, భక్తులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి శఠగోపం బహుకరణ



శఠగోపం బహుకరిస్తున్న వెంకటేశం వరలక్ష్మి దంపతులు

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూరు పట్టణ కేంద్రంలోని దక్షిణ కాశీ శ్రీ సిద్ధ రామేశ్వర ఆలయంలో ఉన్న అమ్మవారి ఆలయానికి శఠగోపాన్ని మాదాపూర్ (సీతాఫల్మండి)కి గాంధారి వెంకటేశం వరలక్ష్మి దంపతులు తండ్రి సిద్ధయ్య జ్ఞాపకార్థం ఆలయ ఈవో శ్రీధర్‌కు అందజేశారు. అనంతరం ఆలయ ఈవో దంపతులను శాలువాతో సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షుడు చంద్రకాంత్ రెడ్డి, రామేశ్వర్ పల్లి మాజీ సర్పంచ్ శ్యామల, ఆలయ అర్చకులు రాజేశ్వర శర్మ, తదితరులు ఉన్నారు.

నేడు ప్రజా పాలన

నవతెలంగాణ-మద్నూర్

నేడు (మంగళవారం) ఉదయం 9 గంటలకు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా పాలన దినోత్సవం నిర్వహించనున్నట్టు తహసీల్దార్ ఎమ్‌డీ ముజీబ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అధికారికంగా ఘనంగా నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిపారు. సెప్టెంబర్ 17న మద్నూర్ మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట తహసిల్దార్ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయనున్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబి సంబరాలు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మహమ్మద్ ప్రవక్త జన్మదిన పురస్కరించుకొని సోమవారం మండల కేంద్రంలో ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త జన్మదిన సందర్భంగా ఆదివారం రోజు రాత్రి జాగరణ నిర్వహించి సోమవారం ఉదయాన్నే ర్యాలీ నిర్వహించి పండగను నిర్వహించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ముస్లింలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా ఏర్పాట్లను పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ అశిష్ సాంగ్వాన్

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి కలెక్టరేట్ ఆవరణలో జరిగే ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా ఏర్పాట్లను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కామారెడ్డి కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా అధికారులతో ప్రజా పాలన దినోత్సవం ఏర్పాట్లపై సమక్ష నిర్వహించారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని విద్యాశాఖ అధికారులకు తెలిపారు. వైద్య ,ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేయాలని చెప్పారు. డి ఆర్డిఓ, మెప్మా ఆధ్వర్యంలో ప్రజా పాలన దినోత్సవ వేడుకలకు మహిళలు హాజరయ్యే విధంగా చూడాలన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, పాత్రికేయులు, మహిళలు, ప్రజలు కూర్చోవడానికి సరిపడా ఫర్నిచర్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ నర్సింహారెడ్డి, సిపిఓ రాజారామ్, డి ఆర్డిఓ సురేందర్, జిల్లా వయో వృద్ధుల, శిశు సంక్షేమ అధికారి బావయ్య, ట్రాన్స్కో ఎస్ఈ రమేష్ బాబు, జిల్లా వైద్యాధికారి చంద్రశేఖర్, మెప్మా పిడి శ్రీధర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జాలరుకు చిక్కిన 30 కిలోల చేప

నవతెలంగాణ-రెంజల్



రెంజల్ మండలం బోర్గం గ్రామ సమీపంలో ఉన్న గోదావరిలో చేపల వేటకు వెళ్లిన జాలరికి 30 కిలోల భారీ చేప చిక్కింది. సాయిలు అనే జాలరి చేపల వేటకు వెళ్లగా.. వలలో 30 కిలోల చేప చిక్కినట్టు తెలిపారు. దాని విలువ రూ.4500 ఉంటుందని తెలిపారు. పెద్దచాప చిక్కిడంతో జాలరి సంతోషం వ్యక్తం చేశాడు.

వైద్యురాలికి మెమో జారీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

ముదక్‌పల్లి పీహెచ్‌సీ వైద్యురాలికి కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎంఅండ్‌హెచ్‌వో మెమో జారీ చేశారు. ఇటీవల నిజామాబాద్ జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ముదక్‌పల్లి పీహెచ్‌సీ సెంటర్‌ను సందర్శించారు. ఆ సమయంలో అయూష్ వైద్యురాలితో పాటు సిబ్బంది విధుల్లో లేరు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎంఅండ్‌హెచ్‌వో రాజ శ్రీ సోమవారం మెమో జారీ చేశారు. కాగా పీహెచ్‌సీ ఇన్‌చార్జి ఆఫీసర్గా డిప్యూటీ డి ఎం అండ్ హెచ్ ఓ అంజనకు బాధ్యతలు అప్పగించారు అని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సంబంధిత అధికారులు, సిబ్బంది చర్చించుకుంటున్నారు.

నవతెలంగాణ
నిజామాబాద్
మంగళవారం | సెప్టెంబర్ 17, 2024 | www.navatelangana.com

సజావుగా 'ప్రజా వేదిక' కార్యక్రమం

నవతెలంగాణ-ముప్కాల్

3వ విడత సామాజిక తనిఖీ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం ముప్కాల్ మండల కేంద్రంలో డీఆర్డీవో సాయగౌడ్ అధ్యక్షతన 'ప్రజా వేదిక' కార్యక్రమం నిర్వహించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీలో భాగంగా మండలంలోని ఆయా గ్రామాల్లో గత ఏడాది 2023 ఏప్రిల్ నెల నుంచి మార్చి నెల 2024 వరకు జరిగిన పనులపై సామాజిక తనిఖీ బృందం ఈ నెల 9వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఆడిట్ సామాజిక తనిఖీలు చేపట్టారు. చేపట్టిన ఆడిట్ పనులను డీఆర్డీవో సాయగౌడ్ సమక్షంలో మండల ప్రజలకు చదివి వినిపించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహ్మద్ ముజాఫరొద్దీన్, ఎంపీవో మహమ్మద్ గౌస్, ఏపీవో నారాయణ, ఏపీఎం శకుంతల, ఏఆర్పీ సుశీల, ఆయా గ్రామాల పంచాయతీ సెక్రటరీలు, గ్రామీణ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ లు తదితరులు పాల్గొన్నారు.

బోధన్ నుంచి అరుణాచలం యాత్రకు బస్సు ప్రారంభం

నవతెలంగాణ-బోధన్



బస్సును ప్రారంభించిన పలువురు

బోధన్ డిపో నుంచి అరుణాచలం పౌర్ణమి గిరి ప్రదక్షిణ యాత్రకు ప్రయాణికుల సౌకర్యార్థం డిపో మేనేజర్ శ్రీనివాస్ సోమవారం బస్సును ప్రారంభించారు. బోధన్ బస్టాండ్ నుంచి ప్రయాణికులతో బస్సు బయలుదేరింది. పౌర్ణమి రోజున అరుణాచల గిరి ప్రదక్షిణ కోసం ప్రయాణికుల సౌకర్యార్థం బోధన్ డిపో నుంచి సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు చేసినట్టు వివరించారు. బస్సు కాణిపాకం, వెల్లూరు, గోల్డెన్ టెంపుల్ దర్శనం చేసుకొని, అరుణాచల గిరి ప్రదక్షిణకు 17వ తేదీన చేరుకొని, మరుసటి రోజు తిరిగి జోగులాంబ దర్శనానికి బయలుదేరుతుందని తెలిపారు. అనంతరం 19వ తేదీన బోధన్‌కు తిరుగి ప్రయాణం అవుతుందని పేర్కొన్నారు. పెద్దలకు రూ.4400, పిల్లలకు రూ.3600 టికెట్ ధర నిర్ణయించినట్లు తెలిపారు.

కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న మాశెట్టి ఆదిత్య

నవతెలంగాణ-కోటగిరి

నూతన టీ.పీ.సీ.సీ. చీఫ్ ఎమ్మెల్సీ బొమ్మా మహేష్ కుమార్ గౌడ్ సమక్షంలో కోటగిరి గ్రామానికి చెందిన ఎన్ఎస్‌యుఐ మాజీ అధ్యక్షులు మాశెట్టి ఆదిత్య సోమవారం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.

ముప్కాల్‌లో సినిమా షూటింగ్ సందడి



సినిమా షూటింగ్ ప్రారంభిస్తున్న పలువురు

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ మండల కేంద్రంలో 'గ్యాంగ్ ఆఫ్ గోపాల్ పేట్' చిత్రం షూటింగ్ ప్రారంభమైంది. ముప్కాల్ పడిలేచిన మర్రిచెట్టు దేవస్థానం వద్ద ఆదివారం రాత్రి 'రీల్ రియల్ మూవీ క్రియేషన్' చిత్ర నిర్మాణ సంస్థ అధినేత శ్రీఫణీంద్ర నిర్మాణ సారథ్యంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ చిత్రానికి ప్రముఖ తెలంగాణ గేయ రచయిత కోదారి శ్రీనివాస్ సంగీత దర్శకత్వం వహిస్తున్నట్లు చిత్ర దర్శకులు వైవీ మధు మల్లం తెలిపారు. నూతన నటీనటులతో గ్రామీణ నేపథ్యంలో యువతకు స్ఫూర్తిగా నిలిచే కథతో కూడిన సన్నివేశాలు ఉంటాయన్నారు. ఈ చిత్రానికి ముహూర్తం షాట్‌ను టీఎస్ యుటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓ.రమేష్ క్లాప్ కొట్టి ప్రారంభించారు. ముప్కాల్, బాల్కొండ, మెండోరా తదితర గ్రామీణ ప్రాంతాలలో ఈ చిత్రం షూటింగ్ జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో అసోసియేట్ డైరక్టర్ సంఘీర్, పాండురంగ బుక్స్ డిస్ట్రిబ్యూటర్స్ అధినేతలు రాంరాజు, ఉమేష్, స్టూడియో శ్రీను, దశరథ్, ఆనంద్‌గౌడ్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కోనసముందర్‌లో వినాయకుడి లడ్డు వేలం పాట



లడ్డు దక్కించుకున్న సామా చిన్నారెడ్డి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని కోనసముందర్‌లో స్థానిక గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన వినాయక మండపం వద్ద సోమవారం వినాయకుని లడ్డూ వేలం పాట నిర్వహించారు. వేలం పాటలో గ్రామానికి చెందిన సామా చిన్నారెడ్డి రూ.36వేల వేలం పాడి వినాయకుని లడ్డును దక్కించుకున్నారు. తొమ్మిది రోజుల పాటు పూజలు అందుకున్న వినాయకుడి చేతిలోని లడ్డు వేలం పాటలో తనకు దక్కడం పట్ల సామ చిన్నారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.అనంతరం గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో వినాయకుని నిమజ్జన శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు కాంతి సాయన్న, కోశాధికారి భూమన్న, కార్యదర్శి రాజా గంగారాం, దుంపల విజయ్ కుమార్, కొలిప్యాక ఎల్లయ్య, ఎలిషాల భూమయ్య, చిమ్మటి నరసయ్య గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

వీడియో కాల్‌తో 1,40,000 మాయం

- సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- 2వ పోలీస్ స్టేషన్ ఎస్ఐ యాసిర్ అరాఫత్

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా కేంద్రంలోని రెండవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తికి వీడియో కాల్ చేయడం ద్వారా తన బ్యాంక్ అకౌంట్ నుంచి రూ.1,40,000 మాయమైనట్లు ఎస్ఐ యాసిర్ అరాఫత్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మొహమ్మద్ ముజాహిద్ అనే వ్యక్తి ఒక దరఖాస్తు ఇవ్వడం జరిగింది. అతనికి ఒక 12 అంకెల నెంబర్తో ఫోన్ రావడం జరిగింది. మీకు లోన్ అప్లై చేసుకున్నారు కదా నేను బ్యాంకు నుంచి మాట్లాడుతున్నాను.. మీ లోన్ అప్రూవ్ అయినది మీరు నేను వీడియో కాల్ చేస్తే లిఫ్ట్ చేయగలరు అని సైబర్ నెరగాళ్లు ఫోన్ చేశారని తెలియజేశారు. ఆటోమేటిక్‌గా మీ డీటెయిల్స్ తమకు షేర్ అయిపోతాయి అని చెప్పగానే అతను వీడియో కాల్ లిఫ్ట్ చేయగానే అతని అకౌంట్ నెంబర్ అతని అకౌంట్ డీటెయిల్స్ అన్ని సైబర్ ఫ్రాడ్ అతనికి వెళ్లిపోవడం జరిగి అతనికి తెలవకుండానే 1,40,000 అతని అకౌంట్ నుంచి కట్టవడం జరిగిందని బాధితుడు తెలిపాడని పేర్కొన్నారు. మోసాన్ని గ్రహించి ముజాహిద్ బర్కత్పురా అనే అతను పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కావున నగర ప్రజలు ఏదైనా ఫ్రాడ్ కాల్ ఫేక్ కాల్ వస్తే ఎవరు కూడా నమ్మకండి అలాంటి ఫ్రాడ్ కాల్ ఫేక్ కాల్ వస్తే 1930కి కాల్ చేసి చెప్పగలరని తెలియజేశారు. ఏ బ్యాంకు వాళ్ల గాని లోన్ ఇచ్చేవారు కానీ మిమ్మల్ని ఫోన్లో సంప్రదించరు అని తెలియజేశారు. వారు తమ తమ ఆఫీస్‌కి వచ్చి ఫిజికల్‌గా డాక్యుమెంట్ సబ్మిట్ చేయమని చెప్తారు తప్ప ఇలా ఫోన్లో ఎవరన్నా లోన్ గురించి కానీ ఇతర క్రెడిట్ కార్డు ఇంక్రీజ్ అయిందని కానీ చెప్తే అలాంటి వాటికి నమ్మకూడదని తెలియజేస్తున్నామన్నారు.

మహిళ మృతదేహం లాభ్యం

నవతెలంగాణ-మాక్లూర్



తెనుగు అమ్మాయి(ఫైల్)

మండల కేంద్రంలో వారం రోజులక్రితం మహిళ అదృశ్యమైన సోమవారం దామర చెరువులో తెనుగు అమ్మాయి (68) శవమై తేలింది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకొని శవాన్ని బయటకుంతిశారు. శవాన్ని కుటుంబీకులు చూసి తమ వ్యక్తిగా గుర్తించారు. మాక్లూర్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం తెనుగు అమ్మాయి (68) మతిస్థిమితం సరిగ్గా లేకపోవడంతో ఈ నెల 11వ తేదీ ఉదయం 7 గంటల నుంచి కనబడుటలేదు. ఆమె యొక్క తమ్ముడు మర్ల లక్ష్మణ్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. శవాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు.

ఘనంగా ఈద్ మిలాద్ ఉన్ నబి

- మహమ్మద్ ప్రవక్త శాంతిసందేశం తెలుపుతూ ర్యాలీలు

నవతెలంగాణ-విలేకరుల బృందం



డిచ్‌పల్లి: ర్యాలీగా వస్తున్న ముస్లింలు



బోధన్‌లో..

డిచ్‌పల్లి : ఈద్-మిలాద్-ఉన్-నబీ సందర్భంగా మండల కేంద్రంలోని ఇస్లాంపూర ఇస్లామియా మసీదు నుంచి సోమవారం శాంతి ర్యాలీని మౌలానా మొహసిన్ రజ ప్రత్యేక ప్రార్థనలు చేసి ప్రారంభించారు. ఈ ర్యాలీ మదీనా మస్జిద్ పైగా ఇస్లాంపుర కాలనీలోని వీధివీధిలో తిరుగుతూ డిచ్‌పల్లి రైల్వేస్టేషన్ వీధుల వెంబడి మొహమ్మద్ ప్రవక్త శాంతి సందేశాన్ని తెలుపుతూ గాంధీనగర్ మస్జిద్ వరకు చేరుకున్నారు. అక్కడ మతపెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేసి ర్యాలీని కొనసాగించారు. నడిపల్లి మసీదు, గాంధీనగర్ మసీదు మీదుగా డిచ్‌పల్లి మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లోని జామా మసీదు వద్ద ర్యాలీని ముగించారు. ఈ ర్యాలీ మౌలానా మొహసిన్ రజ నేతృత్వంలో నిర్వహించారు. ఈద్ మిలద్-ఉన్-నబీ సందర్భంగా ప్రతి వీధులను ప్రత్యేకంగా విద్యుదీపాలతో అలంకరించారు. అదేవిధంగా వీధులలో ర్యాలీ నిర్వహించినప్పుడు తమ వంతు అల్పాహారాన్ని యువకులు అందించి సేవా కార్యక్రమాలు చేశారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా డిచ్‌పల్లి సీఐ కె.మల్లేష్, ఎస్‌హెచ్ఓ మహమ్మద్ షరీఫ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మదీనా మస్జిద్ ఇమామ్‌లు ఇనాముల్ హక్, హాష్మీ మౌలానా, పోలీస్ క్యాంప్ మసీదు ఇమామ్ ఎజాస్ అహ్మద్ ఖాన్, జామా మస్జిద్ ఇమామ్ సమీర్ అహ్మద్, గాంధీనగర్ మసీదు ఇమామ్ బిలాల్, దేవనగర్ మసీదు ఇమామ్ యూసఫ్ రజా, మతపెద్దలు, మోహమ్మద్ యూసుఫ్, మాజీ కో-ఆప్షన్ సభ్యులు షేక్ నయీమ్, మైనార్టీ నాయకులు డాక్టర్ శాదుల్లా, మోహమ్మద్ అప్సర్ తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి : మండలంలో మిలాద్ ఉన్ నబీ వేడుకలను మైనార్టీ సోదరులు ఆయా గ్రామాలలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఈద్గా వద్దకు వెళ్లి ప్రత్యేక నమాజ్ చేసిన అనంతరం మసీదులకు చేరుకొని ప్రార్థనలు నిర్వహించారు. సమస్యాత్మక గ్రామాలలో ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణ రెడ్డి పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేసి ఆయన సైతం పర్యవేక్షించారు.

బోధన్ : మహ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలను ముస్లిం సోదరులు బోధన్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బోధన్ పట్టణంలో ముస్లింలు భారీ ర్యాలీ నిర్వహించారు. మిలాద్ ఉన్ నబి సందర్భంగా పట్టణంలోని రెంజల్ బేస్‌లో గల జలాల్ బుఖారి రహమతుల్లా అలై దర్గా వద్ద నుంచి ర్యాలీ ప్రారంభమైంది. పోస్ట్ ఆఫీస్, శర్బతికెనాల్ అంబేద్కర్ చౌరస్తా, రాకాసిపేట్, గోశాల రోడ్ మీదుగా పాత బస్టాండ్ వరకు కొనసాగింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు చేపట్టారు. బోధన్ ఎసిపి శ్రీనివాస్, సిఐ వెంకటనారాయణ ఆధ్వర్యంలో పోలీసు ఉద్యోగులు తగిన చర్యలు తీసుకు న్నారు. అనంతరం జూలుస్ కమిటీ ఆధ్వర్యంలో పోలీసు అధికారులను పూలమాల, శాలువాలతో సత్కరిం చారు. కార్యక్రమంలో మిలాద్ ఉన్ నబీ జూలుస్ కమిటీ ప్రతినిధులు షేక్ కలీం, మోయిన్ రాజా, అలీమ్ ఉద్దీన్, సమీ, హాజీ, ఖలీల్, అహ్మద్, జావిద్, షేక్ అఫ్జల్, తదితరులు పాల్గొన్నారు.

పోతంగల్ : మండలంలోని హంగర్గఫారం గ్రామంలో ఈద్ ఎ మిలాద్ ఉన్ నబీ జులూస్ నిర్వహించారు. ఈ జులూస్‌లో మస్జిద్ ఎ ఖాజగాన్ ఇమామ్ సహాబ్, మస్జిద్ కమిటి గ్రామస్తులు పాల్గొనారు.

రెంజల్ : మండలంలోని వీరన్నగుట్ట గ్రామంలో మిలాద్ ఉన్ నబి పండుగ వేడుకలను ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా వారు ర్యాలీ చేపట్టారు. ప్రపంచానికి శాంతి, కరుణ, ఐక్యత, తెలియజేసిన మహమ్మద్ ప్రవక్త జన్మదినం పురస్కరించుకొన్న పవిత్ర దినమని వారు పేర్కొన్నారు. అనంతరం ప్రార్థన మందిరంలో వారు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు అజ్గర్ అలీ, ఇస్మాయిల్, అప్సర్, షౌకత్ అలీ, మహబూబ్, అజ్మత్, ఇబ్రహీం, అక్బర్, సలీం వాజిద్, తదితరులు పాల్గొన్నారు.

మసకబారుతున్న బతుకులు..

- నేడు విశ్వకర్మ జయంతి

నవతెలంగాణ-ఆర్మూర్



ఏ ఇంట్లో శుభకార్యం జరిగినా.. ఆభరణాల కోసం స్వర్ణాకారుల వద్దకు వెళ్లాల్సిందే. మన సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా విలువైన పుత్తడికి తమ నైపుణ్యం జోడించి అందమైన ఆభరణాలుగా మలిచేది విశ్వకర్మ స్వర్ణాకారులు. మేలిమి బంగారానికి మెరుగులు దిద్దే స్వర్ణాకారుల జీవితాల్లో మాత్రం చీకట్లు అలుముకుంటున్నాయి. పాశ్చాత్య సంస్కృతి ప్రభావం.. ప్రపంచీకరణ నేపథ్యంలో పెట్టుబడుదారి వ్యవస్థ వచ్చి పెద్దపెద్ద బంగారు నగల షోరూంలు వెలుస్తున్నాయి. రోజురోజుకు వీటి సంఖ్య పెరుగుతుండడంతో స్వర్ణకర వృత్తిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. రెడీమేడ్ నగలు రావడంతో ఒకప్పుడు దర్జాగా బతికిన స్వర్ణకారులు నేడు దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. వృత్తినే నమ్ముకుని కాలం వెల్లదీస్తున్న వారు కొందరైతే.. బతుకు దెరువు కోసం ఇతర రంగాలపై దృష్టి సారిస్తున్న వారు మరికొందరు. నేడు విశ్వబ్రాహ్మణుల ఆరాధ్య దైవం విశ్వకర్మ జయంతిని పురస్కరించుకొని నవతెలంగాణ ప్రత్యేక కథనం.

తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర..

తెలంగాణ ఉద్యమంలో స్వర్ణకారులు కీలక పాత్ర పోషించారు. తెలంగాణ సిద్ధాంతకర్త తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ స్వర్ణకారుడే. తెలంగాణ పోరాట సమయంలో తొలి ఆత్మ బలిదానంతో ఉద్యమానికి ఊపిరి నిచ్చిన శ్రీకాంత్ చారి కూడా విశ్వకర్మ స్వర్ణకారుడే. ఇలా అనేకమంది విశ్వబ్రాహ్మణులు తెలంగాణ ఉద్యమంలో తమ వంతు పాత్ర పోషించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే తమ బతుకులు బాగుపడతాయని భావించిన వారికి కొత్త రాష్ట్రంలో కూడా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో నిరాశలో బతుకులు వెల్లదీస్తున్నారు. మహిళలు ధరించే ముక్కుపుడక, మట్టెలు, పుస్తెలు, పట్టీలు సంస్కృతి సాంప్రదాయాలను ఉట్టిపడేలా విలువైన తమ నైపుణ్యాన్ని జోడించడంలో విశ్వకర్మలది అందెవేసిన చేయి. కర్రలపై అద్భుత కళ రూపాలతో వడ్రంగిలా నైపుణ్యం ఎంతో అబ్బురపరిచేది. నేడు గ్రామీణ ప్రాంతాలలో కుల వృత్తుల వారు పనులు లేక ఇతర పనులు చేస్తూ కాలం వెల్లదీస్తున్నారు.

బెంగాల్ కూలీలతో ఇబ్బందులు..

గతంలో స్వర్ణకారులు ఇంట్లో ఒకరిద్దరు కలిసి ఈ వృత్తి చేసేవారు. మారుతున్న పరిస్థితులతో ఒకవైపు, పనులు లేకుండా ఖాళీగా ఉంటున్న స్వర్ణకార వృత్తి వారికి బెంగాల్ కూలీల రూపంలో మరో సమస్య ఎదురవుతుంది. కొందరు వ్యాపారులు స్థానిక స్వర్ణకారులకు పోటీగా బెంగాల్ నుంచి తక్కువ వేతనాలకు వర్కర్లను తీసుకొచ్చి ఇక్కడ వారికి పనులు లేకుండా చేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విశ్వకర్మ యోజన పథకంలో అసలైన విశ్వకర్మలకు న్యాయం జరగడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లావ్యాప్తంగా..

జిల్లా వ్యాప్తంగా 5వేల పైన స్వర్ణాకార కుటుంబాలు, మనుమయ ఇతర వారు 10,000 పైన వృత్తిపై ఆధారపడి బతుకుతున్నారు. ఒకప్పుడు బంగారు ఆభరణాల తయారీతో బిజీగా గడిపిన స్వర్ణకారుల బతుకులు చీకట్లు అలముకుంటున్నాయి. ఆ చేత సంస్కృతి ప్రపంచీకరణ ప్రభావం కారణంగా పెద్దపెద్ద బంగారు నగల షోరూములు వెలుస్తుండడంతో స్వర్ణాకార వృత్తి వారికి పనులు లేకుండా పోయాయి. ఒకప్పుడు దర్జాగా బతికిన స్వర్ణకారులు నేడు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చేతిలో పనులు లేక పస్తులుంటున్నారు.

పట్టణ పరిధిలో..

పట్టణ పరిధిలో గోల్డ్, వెండి, సిల్వర్ జువెలరీ షాపులు 500 వరకు ఉండగా, ఫర్నీచర్ వుడ్ వర్క్ చేసేవారు 200కు పైగా ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అనేకమంది ఉన్నారు.

> **సబ్సిడీ రుణాలు అందించాలి**
>
> స్వర్ణకార ఫెడరేషన్ ఏర్పాటు చేసి వృత్తి నైపుణ్యం కోసం ఆధునా తన మిషనరులకు సబ్సిడీ రుణాల ను అందించాలి. వృద్ధ స్వర్ణకారు లకు పింఛన్లు అందజేయాలి. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించాలి.
>
> \- శ్రీరామ్ కిషన్, ఎం.కె జ్యువెలర్స్, ఆర్మూర్.

స్వాతంత్ర్య సమరయోధుడు ఒడ్డె ఓబన్న స్ఫూర్తితో వడ్డెర్లు ఉద్యమించాలి



మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-కంఠేశ్వర్

స్వాతంత్ర్య సమరయోధుడు ఒడ్డె ఓబన్న స్ఫూర్తితో వడ్డెర్లు ఉద్యమించాలని వడ్డెర జెఏసి రాష్ట్ర కన్వీనర్ దండి వెంకట్ పిలుపునిచ్చారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లో గల మహనీయుల పార్క్‌లో ఒడ్డె ఓబన్న విగ్రహ ప్రతిష్ట స్థలంలో భూమి పూజ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. దేశంలో కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు రోడ్లు, భవనాలు, రైల్వేలు, పంచాయతీ నుండి పార్లమెంట్ భవనం వరకు వడ్డెర్ల చమట, నెత్తురు ధారపోసి ఆధునిక భారతదేశాన్ని నిర్మించిన శ్రామిక జాతులలోని ముఖ్యమైన వడ్డెర ప్రజలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయని దండి వెంకట్ ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే చరిత్రలో పోరాడిన జాతి మాత్రమే అభివృద్ధి సాధించిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వడ్డెర జెఏసి జిల్లా కార్యదర్శి బత్తుల శంకర్, జిల్లా ఉపాధ్యక్షులు ఎత్తరి రాములు, సహయ కార్యదర్శి ఆర్. నర్సింహులు, సీనియర్ నాయకులు ముద్దం గిరి, నాయకులు జి.శ్రీనివాస్, బి.శ్రీనివాస్, పి. సాయిలు తదితరులు పాల్గొన్నారు.

సోయపంటను పరిశీలించిన ప్రైవేటు కంపెనీ శాస్త్రవేత్తలు



పంటను పరిశీలిస్తున్న ప్రైవేటు కంపెనీ శాస్త్రవేత్తలు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కందకుర్తి గ్రామంలో 23 రకాల సోయపంటను వేయగా.. ఆ పంటను ప్రైవేట్ శాస్త్రవేత్తలు సోమవారం పరిశీలించారు. భారతదేశంలో పండించే 23 రకాల పంటలలో ఇక్కడ వాతావరణానికి తట్టుకొని ఎక్కువ దిగుబడినిచ్చే రకాన్ని వారు ఎంపిక చేశారు. ఆ సోయా పంటను ఎంపిక చేసి దానిని విస్తరింపచేయాలన్న ఉద్దేశంతో వారు ఇక్కడికి వచ్చినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ ఉస్మాన్ సాబ్, డైరెక్టర్ అన్జీవరెడ్డి, సోయల్ బేగ్, హసీముద్దీన్, ఇంజనీర్ ఖలీముల్లా హుస్సేన్, తదితరులున్నారు.

నేడు పట్టణంలో విశ్వకర్మ జయంతి

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని సిద్దులగుట్ట సమీపంలో గల విశ్వబ్రాహ్మణ సంఘం భవనం విశ్వకర్మ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్టు పట్టణ అధ్యక్షుడు భాను ప్రకాష్ చారి, కోశాధికారి జి.తిరుపతి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంతో పాటు వివిధ గ్రామాలలోని విశ్వబ్రాహ్మణ సోదరులు హాజరుకావాలని, అన్నదాన కార్యక్రమం సైతం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

పంచాయతీ సెక్రటరీ కోసం ఎదురుచూపులు

నవతెలంగాణ-ముప్కాల్



పంచాయతీ భవనం

ముప్కాల్ గ్రామపంచాయతీ కార్యాలయంలో పంచాయతీ సెక్రటరీ లేకపోవడంతో గ్రామంలో అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే ముప్కాల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తించే అధికారి పలు ఆరోపణలతో జూన్ నెలలో సస్పెన్షన్‌కు గురయ్యారు. సస్పెన్షన్‌కు గురైన ఆ అధికారి సస్పెన్స్ కాలం పూర్తికావడంతో తిరిగి కమ్మర్‌పల్లి మండలంలోని ఓ గ్రామంలో విధుల్లో చేరారు. జూన్ నెలలో సస్పెన్షన్‌కు గురైన సెక్రటరీ స్థానంలో ఇంఛార్జి పాలన కొనసాగుతోంది. ముప్కాల్ మేజర్ పంచాయతీ కావడంతో పనులు అనేకంగా ఉంటాయని, పనులు నెమ్మదించడంతో అభివృద్ధి కుంటుపడుతుందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఒకవైపు సర్పంచ్ పాలన లేక, మరోవైపు పంచాయతీ సెక్రటరీ లేక గ్రామంలో అభివృద్ధి పనులకు ఆటంకాలు ఏర్పడుతున్నట్లు గ్రామస్తులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ సెక్రటరీకై ముప్కాల్ గ్రామస్తులు ఎదురుచూపులు చూస్తున్నారు. ప్రస్తుతం రెంజర్ల పంచాయతీ సెక్రటరీకి ఇక్కడి ఇంచార్జ్ పాలన బాధ్యతలు అప్పగించారు. ఇంచార్జ్ బాధ్యతలు స్వీకరిస్తున్న రెంజర్ల పంచాయతీ సెక్రటరీ అటు రెంజర్ల, ఇటు ముప్కాల్ పంచాయతీ పనులు చేపట్టడం సవాలుగా మారుతోంది. రెండు గ్రామాలు మేజర్ పంచాయతీలు కావడంతో ముప్కాల్‌కు పూర్తి స్థాయిలో న్యాయం చేయలేని పరిస్థితిలో ఉన్నారని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. ఒక రోజు కావాల్సిన పనులు సెక్రటరీ లేకపోవడం, ఇంఛార్జి సెక్రటరీ వల్ల పనులు మూడు రోజుల పాటు పెండింగ్‌లో ఉంటున్నట్లు స్థానిక గ్రామస్తులు అంటున్నారు. జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ముప్కాల్ గ్రామపంచాయతీకి రెగ్యులర్ గ్రామ కార్యదర్శిని నియమించాలని కోరుతున్నారు.

తెలంగాణ విమోచన దినాన్ని అధికారికంగా నిర్వహించాలి

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ డిమాండ్ చేశారు. భారతదేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్రం సిద్ధిస్తే తెలంగాణ మాత్రం హైదరాబాద్ సంస్థానంగా నిజాం నిరంకుశ నిర్బంధంలో ఉందని ఆనాడు రజాకార్ల రాక్షస పాలనకు చరమగీతం పలికేందుకు బాంచన్ దొర అన్న చేతులు బంధుకులు పట్టి నిజాంకు ఎదురు తిరిగిన చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, షేక్ బంధాగి లాంటి వీరుల, వీరవనితల పోరాటస్ఫూర్తితో నిజాం రజాకార్ల ముకలను తరిమికొట్టిన చరిత్ర తెలంగాణ గడ్డది అని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

● మరొకరికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-వర్ని

మండలంలోని మల్లారం గ్రామ శివారులో బైక్‌ను ఎదురుగా వచ్చే డిసిఎం వాహనం ఢీకొట్టడంతో బైక్‌పై వెళుతున్న మురళి (26) అనే యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్ఐ కృష్ణ కుమార్ వివరాల ప్రకారం.. మెండోరా మండలం దూదిగాం గ్రామానికి చెందిన మురళి అతని భార్య స్వప్న ఇద్దరు బిచ్కుంద వెళ్ళుతుండగా బాన్సువాడ నుంచి ఎదురుగా వస్తున్న డీసీఎం వాహనం ఢీకొట్టింది. దీంతో మురళి అక్కడిక్కడే మృతిచెందాడు. మృతిని భార్య స్వప్నకు కాలుకు, తలకు తీవ్రంగా గాయాలయ్యాయి. ఆమెను జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి 108 వాహనంలో తరలించామని, మృతిని అన్న గంగాధర్ పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మురళి మృతదేహం

అదుపుతప్పి ఆటో బోల్తా

● బాలుడు మృతి

నవతెలంగాణ-భీంగల్ రూరల్

అదుపుతప్పి ఆటో బోల్తా పడటంతో ఆటోలో ప్రయాణిస్తున్న బాలుడు మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి.. భీంగల్ మండల కేంద్రంలోని కేసీఆర్ కాలనీకి చెందిన సయ్యద్ రియాన్ (09) ఆయన కుటుంబ సభ్యులతో కలిసి భీంగల్ మండల కేంద్రానికి మార్కెట్‌కు వెళ్లి.. కేసీఆర్ కాలనీకి తిరిగి ఆటోలో వస్తుండగా.. సంతోష్‌నగర్ తాండా దాటిన తర్వాత రోడ్డుపై ఆటో బోల్తాపడింది. బాబుకి తలకు బలమైన గాయాలు అవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అలాగే ఆటోలో ఉన్న బేగం చేయికి గాయాలయ్యాయి. మృతుని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


బాలుడి మృతదేహం

వినాయక నిమజ్జనం శోభాయాత్ర దృష్ట్యా

వాహనాల దారి మళ్లింపు

నవతెలంగాణ-కంఠేశ్వర్

రేపు(మంగళవారం), ఎల్లుండి(బుధవారం) గణేష్ నిమజ్జనాలు ఉన్నందున బాసర గోదావరి బ్రిడ్జి పై నుండి పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌కు అనుమతి లేదని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. నిజామాబాద్ నుండి బాసర వైపు వెళ్లే వాహనాలు నవీపేట్ శివాజీచౌక్ నుండి కలియాపూర్, దండిగుట్ట, వీరన్నగుట్ట, రెంజల్ కమాన్ ఎక్స్‌రోడ్, సాటపూర్ ఎక్స్‌రోడ్, నీల, నీలా పేపర్ మిల్, కందకుర్తి బ్రిడ్జి మీదుగా ధర్మాబాద్ గుండా బిద్రెల్లి నుండి బాసరకు వెళ్లాలని సూచించారు. అలాగే బాసర వైపు నుండి నిజాంబాద్ వచ్చే వాహనాలు బిబ్రేల్లి నుండి ధర్మాబాద్ మీదుగా కందకుర్తి, రెంజల్ నుండి నిజామాబాద్ వైపు వెళ్లాలని సూచించారు. మంగళవారం, బుధవారం రెండు రోజులు బాసర గోదావరి బ్రిడ్జి మీద గణేష్ నిమజ్జనాలు ఉన్నందున నిమజ్జనానికి వచ్చే గణేశుడితో పాటు కూడిన వాహనాలు మాత్రమే అనుమతించబడతాయని అన్నారు. అలాగే గణేష్ నిమజ్జనం అయిన తర్వాత నిమజ్జనం పూర్తి చేసుకున్న వాహనాలు నేరుగా బాసర మీదుగా బిదిరెల్లి నుండి ధర్మాబాద్ మీదుగా కందకుర్తి వైపు నుండి రెంజల్ మీదుగా నిజాంబాద్ చేరుకోవాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ కోరారు. ప్రజలు, ప్రయాణికులు అందరూ ట్రాఫిక్ డైవర్షన్ పాటిస్తూ, గణేష్ నిమజ్జనోత్సవానికి సహకరించాలని కోరారు.

రెండు కులాలు కూర్చొని వర్గీకరణపై సమగ్రమార్గం వెతకాలి

నవతెలంగాణ-ఆర్మూర్

ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై మాదిగ మాల ఉపకులస్తులు కూర్చొని సామరస్యంగా చర్చించుకోవాలని, సమగ్ర పరిష్కార మార్గం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తెలపాలని, తదనంతరం రాజ్యాధికారం కోసం కల్సికట్టుగా ఉద్యమించాలని ధర్మ సమాజ్ పార్టీ (డి.ఎస్.పి) రాష్ట్ర కార్యదర్శి గడ్డం హరీష్ గౌడ్ బహుజన లోకానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఓ/బీసీల సమగ్ర జనగణన జర్పాల్సిందే అంటూ ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. పట్టణంలో డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ 21న సాయంత్రం 6గంటలకు బాల్కొండ లోని ఎం.కె గార్డెన్లో జరగనున్న "బుద్ధం శరణం గచ్చామి" అనే గంటన్నర భవ్య నాటిక ఆహ్వాన పత్రాన్ని ఆయన చేతుల మీదుగా విడుదల చేశారు. ముంబై నుంచి విచ్చేసిన ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు మూల్ నివాసి మాలజీ, జిల్లా నాయకులు అంగుళి మాలజీ, మమత మాలజీ, శివశక్తి భీంశక్తి చీఫ్ డి.ఎల్ మాలజీ, డి.ఎస్.పి మండల నాయకులు ఉమేష్ మహారాజ్, జర్నలిస్ట్ కాపు బొజన్న, పేర్కిట్ రజక సంఘం ఉద్యమ నేత మిరోల్ల బాలరాజు, పి.గోవర్ధన్ విశ్వకర్మ తదితర్లు పాల్గొన్నారు.

శోభాయాత్రకు

ఆటంకం లేకుండా..

● గుంతలు పూడ్చిన సిబ్బంది

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

వినాయక విగ్రహాల నిమజ్జనాన్ని మంగళవారం నిర్వహించనున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అందుకు కావాల్సిన అన్ని రకాల ఏర్పాట్లు చేస్తోంది. నిజామాబాద్ నగరంలోని ప్రజలకు వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో వినాయకనగర్‌లోని వినాయకుల బావి వద్ద రాత్రి వేళలో వినాయక నిమజ్జనానికి సరిపడా విద్యుత్ వెలుగులను కూడా జిల్లా యంత్రాంగం సిద్ధం చేసింది. వినాయకుల బావి వద్ద 5 అడుగుల వినాయకుల విగ్రహాల వరకు నిమర్జనం చేసుకునే అవకాశం కల్పించారు. మిగతావి మాధవ్‌నగర్ ప్రాంతంలోని చెరువులో నిమజ్జనం చేసుకునే అవకాశం కల్పించారు. 8 ఫీట్ల కంటే ఎక్కువ ఎత్తు ఉన్న విగ్రహాలను బాసర్‌కు దగ్గరగా ఉన్న నందిపేట మండలం ఉమ్మెడ బ్రిడ్జి వద్ద వినాయక విగ్రహాల నిమజ్జనానికి అధికార యంత్రాంగం అన్ని రకాలుగా సిద్ధం చేసిందని తెలిపారు.

నిజాంబాద్ నగరంలోని వినాయక నిమజ్జనానికి వెళ్లే దారిలో ఎటువంటి గుంతలు ఉండకుండా, గుంతలను పూడ్చడానికి మున్సిపల్ శాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. అంతేకాకుండా రహదారులు ఉండే గుంతలకు పెద్ద పెద్ద గుంతలను సిమెంట్‌తో పూడ్చి రోడ్డును మరమ్మతులు చేపట్టారు. అంతేకాకుండా చిన్న చిన్న గుంతలను మున్సిపల్ శాఖ వారు ఇసుకతో భర్తీ చేసి రోడ్డును చదునుగా చేసి వాహనాలు వెళ్ళుటకు ఎటువంటి ఇబ్బందులు ఏర్పడకుండా విగ్రహాలు దొరలకుండా, ఆటంకం కలగకుండా మున్సిపల్ శాఖ జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో రోడ్లను చదివిన చేశారు.


రోడ్లపై గుంతలను పూడ్చుతున్న సిబ్బంది

అన్నదానం.. నిమజ్జనం..

● పలుచోట్ల వినాయకుల శోభాయాత్ర

నవతెలంగాణ-విలేకరుల బృందం

ఎడపల్లి : మండలంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని ఎడపల్లి, నయబాది, ధర్మారం, వడ్డేపల్లి, జంలం, అంబం (వై) బ్రాహ్మణపల్లి, ఎంఎస్సీఫారం, పోచారం, వడ్డేపల్లి, బాపునగర్, జైతాపూర్ గ్రామాల్లో వినాయ కచవితి నవరాత్రి పండగ వేడుకల్లో భాగంగా శనివారం రాత్రి గణేష్ మండపాల నిర్వాహకులు భక్తులు, శోభయాత్ర కార్యక్రమంలో పాల్గొన్నారు.

అన్నదాన కార్యక్రమాలు..

మండలంలోని పలు గ్రామాల్లో వినాయక మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు.

మహా అన్నదానం

పొతంగల్ : మండల కేంద్రంలో హనుమాన్ మందిరం వద్ద, గణేష్ ఉత్సవాలలో చివరిరోజు సందర్భంగా, మహా అన్న దాన ప్రసాద కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ప్రజలు పెద్దఎత్తున పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఘనంగా అన్నదాన కార్యక్రమం..

రెంజల్ : రెంజల్ మండలంలోని వీరన్నగుట్ట గ్రామం బీసీ కాలనీలోనీ శ్రీరామ గణేష్ మండలి ఆధర్యంలో కాలనీవాసులు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. శ్రీరామ గణేష్ మండలి నిర్వాహకులు సాయిలు, మధుకర్, రాజు, దేవేందర్, ఆనంద్, మహిళలు చిన్నారు లు పాల్గొన్నారు.

సేవా గణపతి నిమజ్జన శోభాయాత్ర..

కంఠేశ్వర్ : ఇందూరు యువత సేవా సంస్థ కార్యాలయంలో సేవా గణపతిని నెలకొల్పుకుని సేవా గణపతి ఉత్సవ కమిటీ నిర్వహణలో 9రోజుల పాటు ఘనంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు తదితరులు పాలొన్నారు.

సాంప్రదాయబద్ధంగా గణేష్ నిమజ్జన శోభయాత్ర..

కమ్మర్‌పల్లి : మండలంలోని శ్రీ విద్యాసాయి ఉన్నత పాఠశాల విద్యార్థులు గణేష్ నిమజ్జన శోభాయాత్రను సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. పాఠశాలలో ప్రతిష్ఠించిన వినాయకుని తొమ్మిది రోజులపాటు ఘనంగా భక్తిశ్రద్ధలతో పూజించి సోమవారం నిమజ్జన శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. పాఠశాల నుండి గ్రామ శివారులోని చెరువు వరకు విద్యార్థులు కోలాటంతో, సాంప్రదాయబద్ధంగా నృత్యాలు చేస్తూ మండల ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించి, అనంతరం చెరువులో నిమజ్జనం చేశారు. ఈ శోభయాత్ర లో భాగంగా విద్యార్థులు సాంప్రదాయ వస్త్రాలు ధరించి, భక్తి గీతాలకు నృత్యాలు చేయడం అందరినీ విశేషంగా అలరించాయి.


పొతంగల్‌లో..

కోనాపూర్‌లో ఘనంగా వినాయక నిమజ్జనం..

మండలంలోని కోనాపూర్‌లో వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్థానిక మున్నూరు పటేల్ సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుని నిమజ్జన శోభాయాత్ర సంఘ సభ్యుల కోలాహలం మధ్య కొనసాగింది. సంఘ మహిళలు సంప్రదాయబద్ధంగా వస్త్రాలను ధరించి నిమజ్జన శోభాయాత్రలో పాల్గొన్నారు. వినాయక నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా గ్రామస్తులకు అమ్మవారి పటేల్ సంఘం సభ్యులు ప్రసాదాన్ని పంచిపెట్టారు. సంఘ భవనం నుండి గ్రామ శివారులోని చెరువు చెరువు వరకు ఊరేగింపు కొనసాగింది. అనంతరం చెరువు వద్ద వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తిశ్రద్ధలతో చెరువులో నిమజ్జనం చేశారు.

నిమజ్జనంలో మహిళల డప్పు దరువు..

మండలంలోని బషీరాబాద్‌లో స్థానిక గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సాయంత్రం నిర్వహించిన వినాయక నిమజ్జన శోభాయాత్రలో వరంగల్‌కు చెందిన డప్పు దరువు మహిళ బృందం సభ్యులు పాల్గొన్నారు. వినాయక నిమజ్జనం ఊరేగింపు సందర్భంగా డప్పు దరువు మహిళ బృందం సభ్యులు డప్పులు కొడుతూ చేసిన నృత్యాలు గ్రామస్తులను అలరించాయి. నిమజ్జన శోభాయాత్ర కోసం వీరిని గ్రామ వీధి కమిటీ సభ్యులు ప్రత్యేకంగా వరంగల్ నుంచి రప్పించారు.

జక్రాన్‌పల్లి : మండల కేంద్రంలోని అరుంధతి యూత్ వినాయక మండలి వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ప్రజలందరూ అరుంధతి యూత్ ఆధ్వర్యంలో చేపట్టిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని వినాయకుడికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. వివేక్ నగర్ తండాకు చెందిన మాజీ వైస్ ఎంపీపీ జితేంద్ర నాయక్ అరుంధతి యూత్ అన్నదాన కార్యక్రమంలో పాల్గొని వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో అరుంధతి యూత్ సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

దేవి యూత్ మండపం వద్ద కుంకుమార్చన..

ఆర్మూర్ : మున్సిపల్ పరిధిలోని కోటార్మూర్ 6వ మున్సిపల్ వార్డులో దేవి యూత్ గణేష్ మండపం వద్ద మహిళలు వేద పండితులు రాజు ఆధ్వర్యంలో అత్యంత భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన పూజా కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి కుమార్తె, ఆర్ఆర్ ఫౌండేషన్ డైరెక్టర్ పైడి సుచరితరెడ్డి పాల్గొని గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. బిజెపి నాయకులు అంకాపూర్ సురేష్ రెడ్డి, ఆర్మూర్ సంజీవరెడ్డి, గురడి రెడ్డి సంఘ సభ్యుడు ఇట్టేడి మోహన్ రెడ్డి, యూత్ సభ్యులు కొప్పెల అచ్యుత్ రెడ్డి, లక్కారం చిట్టి పాల్గొన్నారు. దేవి యూత్ గణేష్ మండపం ముందర నిర్వహించిన కుంకుమార్చన కార్యక్రమంలో గురడి రెడ్డి సంఘ మహిళామణులు లోక రాజమణి, కొప్పెల సరోజన, లోక శోభ, లక్కారం పద్మ , ఇట్టేడి లలిత, ఇట్టేడి ప్రమీల, ఇట్టేడి పద్మ ఇట్టేడి కవిత, ఇట్టేడి అనిత, ఇట్టేడి రజిత, గోపిడి జ్యోతి, ఇట్టేడి కావ్య, ఇట్టేడి హారిక, కొప్పెల అశ్విత తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

మతసామరస్యాన్ని చాటిన ముస్లిం


ఇక్రమ్‌ను సన్మానించిన నిర్వహకులు

నవతెలంగాణ-భీంగల్ రూరల్

భీంగల్ పట్టణంలో మతసామరస్యాన్ని చాటాడు ఇక్రమ్. భీంగల్ పట్టణంలోని బోదిరిగల్లిలో మున్నూరు కాపు యూత్ ఆధ్వర్యంలో కొలువైన గణేష్ మండపం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ అన్నదానానికి మహమ్మద్ ఇక్రం తనవంతుగా 5000 రూపాయలను ఇచ్చి మతాలకు అతీతంగా వేడుకలు నిర్వహించుకోవచ్చని నిరూపించారు. కార్యక్రమంలో ఐదవ వార్డ్ కౌన్సిలర్ బోదిరి నర్సయ్య, భీంగల్ పట్టణ అధ్యక్షుడు నీలం రవి, సుమన్, నరేష్, గంగాధర్ యూత్ సభ్యులు గల్లి వాసులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE AT NIZAMABAD
O.S.No. 3 of 2024

Between:-
Smt. Namthabad Prasanna & others ...**Plaintiffs**
and
Kunikar Tirupathi @ Katke Tirupathi & others ...**Defendants**

To,
Defendant No.3
Mohammed Afroz S/o. Khaja Pasha, aged about 35 years, Occupation: Business R/o. H.No.1-18/2/A/7, Barkatpura Near Classic Garden, Perkit village, Armoor Mandal, Nizamabad District.

Whereas the above named Plaintiffs filed the above suit for Partition and Separate possession and you are the Defendant No.3 in the above case. The case is posted to **15-10-2024** for your appearance. You are hereby required to appear either in person or through an advocate before the said court on **15-10-2024 at 10.30 A.M** failing which the matter will be decided in your absence.

// BY THE ORDER OF THE COURT //
K. KISHORE REDDY, ADVOCATE, NIZAMABAD

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE AT NIZAMABAD
I.A No. 27 of 2024
in
O.S.No. 3 of 2024

Between:-
Smt. Namthabad Prasanna & others ...**Petitioners/Plaintiffs**
and
Kunikar Tirupathi @ Katke Tirupathi & others ...**Respondents/Defendants**

To,
..Respondent No.3
Mohammed Afroz S/o. Khaja Pasha, aged about 35 years, Occupation: Business R/o. H.No.1-18/2/A/7, Barkatpura Near Classic Garden, Perkit village, Armoor Mandal, Nizamabad District.

Whereas the above named Petitioner/Plaintiff filed the above suit for Partition and Separate possession and the I.A. No.27 of 2024 for not to sell the suit property and you are the Respondent No.3 in the above case. The case is posted to **15-10-2024** for your appearance. You are hereby required to appear either in person or through an advocate before the said court on **15-10-2024 at 10.30 A.M** failing which the matter will be decided in your absence.

// BY THE ORDER OF THE COURT //
K. KISHORE REDDY, ADVOCATE, NIZAMABAD

BEFORE THE HON,BLE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR- NIZAMABAD
ARB. NO. 144 OF 2024
Between:
KANAKADURGA CHIT FUNDS PVT. LTD., Bodhan-BRANCH, ... **Disputant**
And
SAVITHRI MACHKURI , & Others ....**Opponents**
3. VITTAL GAINI, S/o. BAGAIAH G, Aged About 39 Years, Occ: Busi ness, R/o. H.No:1-323/5, Maddela Cheruvu, Pitlam, Nizamabad,.
Take notice that the above dispute is filed against you and others for recovery of amount.This notice was issued to you, but you have failed to receive the same, the above dispute is posted on. 25-09-2024 at 11:30 A.M. For your appearance on that day you have to appear in person before the Deputy Registrar of Chits referred above. Other wise the case will be decided ex-parte.
// By order of This Office //
sd/- DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR NIZAMABAD

BEFORE THE HON,BLE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR-NIZAMABAD
ARB. NO. 135 OF 2024
Between:
KANAKADURGA CHIT FUNDS PVT.LTD., Nizamabad-2 BRANCH, ... **Disputant**
And
HARIKA GANDLA, & Others ....**Opponents**
2. NARSAIAH RAYALA, S/o. RAJAIAH R, Aged About 44 Years, Occ: Record Clerk 675406010 O/o. Lic Of India Armoor,R/o. H.No:3-52/1/A, Ram Nagar, Nandipet, Nizamabad,.
4. VENU GANDLA, S/o. HANUMAIAH G, Aged About 54 Years, Occ: Business, R/o.H.No:2-6-113, Pusala galli, Nizamabad,
Take notice that the above dispute is filed against you and others for recovery of amount. This notice was issued to you, but you have failed to receive the same, the above dispute is posted on. **25-09-2024 at 11:30 A.M.** For your appearance on that day you have to appear in person before the Deputy Registrar of Chits referred above. Other wise the case will be decided ex-parte.
// By order of This Office //
sd/- DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR NIZAMABAD

BEFORE THE HON,BLE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR - NIZAMABAD
ARB. NO. 145 OF 2024
Between:
KANAKADURGA CHIT FUNDS PVT. LTD., Bodhan-BRANCH, ... **Disputant**
And
RAMESH BABU TELUGU, & Others
....**Opponents**
2. SHAEB HUSSAIN SHAIK, S/o. MOULANA S, Aged About 52 Years, Occ: Driver-2 T.S.R.T.C Id No: 3715 O/o bodhan Districtnizamabad, R/O. H.No:1-3-233/1, Azam Gunj., Bodhan, Nizamabad,.
3. CHANDRA PRAKASH MEDHARI, S/o. SHANTHI KUMAR M, Aged About 47 Years, Occ: Driver T.S.R.T.C Id No: 3717 O/o Nizama bad, R/o. H.No:14-23/2, Mirzapur, Kotagiri, Nizamabad,.
Take notice that the above dispute is filed against you and others for recovery of amount. This notice was issued to you, but you have failed to receive the same, the above dispute is posted on. **25- 09-2024 at 11:30 A.M.** For your appearance on that day you have to appear in person before the Deputy Registrar of Chits referred above. Other wise the case will be decided ex-parte.
//By order of This Office//
sd/-DEPUTY REGISTRAR OF CHITS / A RBITRATOR NIZAMABAD

BEFORE THE HON,BLE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR - NIZAMABAD
ARB. NO. 137 OF 2024
Between:
KANAKADURGA CHIT FUNDS PVT. LTD.,Nizamabad-2 BRANCH, ...**Disputant**
And
VIMALA BAI SHIVARATHRI, & Others ....**Opponents**
1. VIMALA BAI SHIVARATHRI, W/o. GANGADHAR, Aged About: 52years,Occ:S.ATelugu,O/o Z.P.H.S Uthnoor, R/o.Flatno - C6 3rd Floor, Sangamithra Arcade, Nizamabad,
3. MAHESH GOLEDI, S/o. SAYANNA G, Aged About 39 Years, Occ: Police Constable 322 O/o Ar 8 Piatoon Nizamabad,R/o. H.No:1-37, Thanakalan, Yedapalee, Nizamabad, Telangana.
4. SAILOO CHIMMA, S/o. POCHAIAH CH, Aged About 44 Years, Occ: Fire Men O/o. Fire Station Nizama bad, R/o.H.No:1-23/1, Timmapur, Yedapelly, Nizamabad,
Take notice that the above dispute is filed against you and others for recovery of amount. This notice was issued to you, but you have failed to receive the same, the above dispute is posted on. **25-09-2024 at 11:30 A.M.** For your appearance on that day you have to appear in person before the Deputy Registrar of Chits referred above. Other wise the case will be decided ex-parte.
// By order of This Office //
sd/- DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR NIZAMABAD

BEFORE THE HON,BLE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR - NIZAMABAD
ARB. NO. 136 OF 2024
Between:
KANAKADURGA CHIT FUNDS PVT. LTD.,Nizamabad-2BRANCH, ... **Disputant**
And
VIMALA BAI SHIVARATHRI, & Others ....**Opponents**
1. VIMALA BAI SHIVARATHRI, D/o. NARAYANA, Aged About :52 years, Occ:School Asst Telugu O/o. Z.P.H.S Uthnoor S.S Nagar Kama reddy, R/o. Flat No C6, 3rd Floor Sangamithra Accade, 1st Mayar Street Vinayaka Naga,Nizamabad,.
2. VENU GOPAL AMANDU, S/o. KISTAIAH, Aged About 47 Years, Occ : Business, R/o. H.No: 6- 13-176, Namdev Wada,Nizamabad, .
3. NAGAVENDER PAPIGARI, S/o. SIDDAIAH, Aged About 41 Years, Occ: Head Supervisor O/o. Observation Home For Boys Nagaram Nizamabad, R/o. H.No:5-11-72, Yendala Veedhi Nagar, Hanuman Temple Yellammaguta, Nizamabad
Take notice that the above dispute is filed against you and others for recovery of amount. This notice was issued to you, but you have failed to receive the same, the above dispute is posted on. **25-09-2024 at 11:30 A.M.** For your appearance on that day you have to appear in person before the Deputy Registrar of Chits referred above. Other wise the case will be decided ex-parte.
// By order of This Office //
sd/- DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR NIZAMABAD

BEFORE THE HON,BLE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR- NIZAMABAD
ARB. No. 146 OF 2024
Between:
KANAKADURGA CHIT FUNDS PVT. LTD., Bodhan-BRANCH, ... **Disputant**
And
RUKMINI PURANAM, & Others ....Opponents
1. RUKMINI PURANAM, S/o. HANUMANDLU, Aged About: 68 years, Occ: House Wife, R/o. H.No:3-1-300, Thattikota Galli, Bodhan, Nizamabad,.
2. SANTOSH GALANDE, S/o. MARUTHI RAO G, Aged About 40 Years, Occ: Language Pandit G.R-LI Id No: 2039750, O/o Dongli Mandal Madnoor District Kama reddy, R/o. H.No:1-4-33, New Sunar Colony, Bodhan,Nizamabad,.
3. PRATHAP PURANAM, S/o. SUDHARSHAN P, Aged About 36 Years, Occ: Business, R/o.H.No:3-1-300, Thattikota, Bodhan, Nizamabad,.
4. KIRAN KUMAR PURANAM, S/o. HANUMANDLU P, Aged About 42 Years, Occ: Business,R/o. H.No:3-1-300, Thattikotagalli, Bodhan, Nizamabad,
Take notice that the above dispute is filed against you and others for recovery of amount. This notice was issued to you, but you have failed to receive the same, the above dispute is posted on. **23-10-2024 at 11:30 A.M.** For your appearance on that day you have to appear in person before the Deputy Registrar of Chits referred above. Other wise the case will be decided ex-parte.
// By order of This Office //
sd/- DEPUTY REGISTRAR OFCHITS/ARBITRATOR NIZAMABAD

BEFORE THE HON,BLE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR - NIZAMABAD
ARB. NO. 138 OF 2024
Between:
KANAKADURGA CHIT FUNDS PVT. LTD.,Nizamabad-2 BRANCH, ... **Disputant**
And
PRABHAKAR GOUD TALLAPALLY, & Others ....**Opponents**
2. SAILU KODENOLLA, S/o. LAXMAIAH, Aged About 39 Years, Occ: Jr Asst O/o. Senior Civil Judge Kamareddy, R/o.H.No:5-11-204/P, Yellammagutta, Nizamabad,
3. VENKATA CHARI GUNDAJI, S/o. LAXMAIAH CHARI, Aged About 59 Years, Occ: Jr Asst O/o. Govt Of Ts Judicial Deprt Nizamabad Dist, R/o. H.No:1-1-479, Hunuman Nagar, Nizamabad,
4. NAGAVENDER PAPIGARI, S/o. SIDDAIAH, Aged About 41 Years, Occ: Head Supervisor O/o. Obser vation Home For Boys Nagaram Nizamabad, R/o. H.No:5-11-72, Yellammagutta, Nizamabad,
5. MASOOR ALI , S/o. MEERJAFAR ALI, Aged About 41 Years, Occ: Jr Asst O/o. Sub-Collector Office Bodhan Nizamabad Dist, R/o. H.No: 6-1-86, Kanteshwar, Bank Colony, Nizamabad, Nizamabad.
Take notice that the above dispute is filed against you and others for recovery of amount. This notice was issued to you, but you have failed to receive the same, the above dispute is posted on. **25-09-2024 at 11:30 A.M.** For your appearance on that day you have to appear in person before the Deputy Registrar of Chits referred above. Other wise the case will be decided ex-parte.
//By order of This Office//
sd/- DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR NIZAMABAD

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR - NIZAMABAD
ARB. NO. 140 OF 2024
Between:
KANAKADURGA CHIT FUNDS PVT. LTD.,Nizamabad-2 BRANCH, ... **Disputant**
And
KHALEED SYED, & Others .... **Opponents**
3. AMEEN SHAIK, S/o. PASHA MIYA SHAIK, Aged About 48 Years, Occ: Business,R/o. H.No:4-6-274/1, Shankaar Nagar, Bodhan, Nizamabad,
4. MUJEEB SHAIK, S/o. HAMEED SHAIK, Aged About 36 Years, Occ: Busainess, R/o. H.No : 5-147/8, Makloor, Nizamabad,
Take notice that the above dispute is filed against you and others for recovery of amount.This notice was issued to you, but you have failed to receive the same, the above dispute is posted on. **25-09-2024 at 11:30 A.M.** For your appearance on that day you have to appear in person before the Deputy Registrar of Chits referred above. Other wise the case will be decided ex-parte.
//By order of This Office//
sd/- DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR NIZAMABAD

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR - NIZAMABAD
ARB. NO. 141 OF 2024
Between:
KANAKADURGA CHIT FUNDS PVT. LTD.,Nizamabad-2 BRANCH, ... **Disputant**
And
RAVI KUMAR MYADARI, & Others .... **Opponents**
5. SHYAM RAO AMBEER, S/o. LAXMAN RAO A, Aged About 33 Years, Occ: Agriculture, R/o.H.No: 1-111, Janagam, Sadashiv Nagar, Nizamabad.
Take notice that the above dispute is filed against you and others for recovery of amount. This notice was issued to you, but you have failed to receive the same, the above dispute is posted on. **25-09-2024 at 11:30 A.M.** For your appearance on that day you have to appear in person before the Deputy Registrar of Chits referred above. Other wise the case will be decided ex-parte.
//By order of This Office//
sd/- DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR NIZAMABAD

BEFORE THE HON,BLE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR - NIZAMABAD
ARB. NO. 139 OF 2024
Between:
KANAKADURGA CHIT FUNDS PVT.LTD., Nizamabad-2 BRANCH, ... **Disputant**
And
LAXMI MADDELA, & Others .... **Opponents**
5.SAIRAJ NAGARAM, S/o. POSHEETY N, Aged About 42 Years, Occ: Private Employee O/o.Kanakadurga Chit Funds Pvt.Ltd., R/o.10-10-1087/N, Nagaram, Nizamabad,
Take notice that the above dispute is filed against you and others for recovery of amount. This notice was issued to you, but you have failed to receive the same, the above dispute is posted on. **25-09-2024 at 11:30 A.M.** For your appearance on that day you have to appear in person before the Deputy Registrar of Chits referred above. Other wise the case will be decided ex-parte.
//By order of This Office//
sd/- DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR NIZAMABAD